ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 1 అక్టోబరు 2025




రాపూరు : పెంచలకోనలో రాజ్యలక్ష్మి అలంకరణలో ఆదిలక్ష్మి

సంగం : దుర్గాదేవిగా దర్శనమిచ్చిన కామాక్షిదేవి



నెల్లూరు : రాజరాజేశ్వరి ఆలయంలో భక్తులను ఆకట్టుకున్న యువతల ప్రదర్శన

# జయహో దుర్గా భవానీ!

భక్తిశ్రద్ధలతో దుర్గాష్టమి • కనుల పండువగా కన్యక పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో మంగళవారం దుర్గాష్టమి పర్వడిని జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో అమ్మవార్లు దుర్గాదేవిగా భక్తులను అనుగ్రహించారు. ఉదయం నుంచి విశేష అభిషేకాలు, పూజలు, అర్చనలు, హోమాలు జరిగాయి. పలు ఆలయాల్లో నవబాల దుర్గాపూజ, కన్యక పూజలు కనుల పండువగా చేశారు. చిన్నారులను అమ్మవార్లుగా అలంకరించి పూజించారు. నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయం, మూలస్థానేశ్వర ఆలయం, ఇరుకళల పరమేశ్వరి, కన్యకాపరమేశ్వరి, జొన్నవాడ కామాక్షితాయి, పెంచలకోన, వేదగిరి, కావలి కలుగోళమ్మ ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.




కావలి : దుర్గాదేవిగా కలుగోళ శాంభవి

బుచ్చి : జొన్నవాడలో దుర్గాదేవిగా కామాక్షితాయి



నెల్లూరు : దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరి



నెల్లూరు : దుర్గాదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు



కుట్టుపై శిక్షణ పొందుతున్న మహిళలు

## శిక్షణ సమాప్తం.. లబ్ధికి దూరం!

మహిళలకు అందని కుట్టు మిషన్లు

నిర్వాహకుల చుట్టూ ప్రదక్షిణలు

ఉదయగిరి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కుట్టు శిక్షణ ప్రక్రియ ముగిసినా లబ్ధిదారులకు ఆ ఫలాలు అందనంటున్నాయి. ధ్రువపత్రం, ఉచితంగా అందించే కుట్టు మిషన్ కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. జిల్లావ్యాప్తంగా 31 కేంద్రాల్లో 1,250 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నారు. బీసీ కార్పొరేషన్ పర్యవేక్షణలో జరిగే ఈ శిక్షణ ఇప్పటికే 26 కేంద్రాల్లో పూర్తవగా, రాపూరు, కలువాయి, కుక్కలగుంట, బుచ్చిరెడ్డిపాళెం, కలిగిరి కేంద్రాల్లో కొనసాగుతోంది. మూడు నెలల్లో పూర్తి కావాల్సిన శిక్షణ పలుచోట్ల నిర్వాహకులు పక్కాగా అమలు చేయకపోవడంతో జాప్యం జరుగుతోంది. శిక్షణ అనంతరం ఇచ్చే ధ్రువపత్రం ద్వారా మహిళలు ఫ్యాషన్ డిజైనింగ్‌లో ముందుకు సాగి స్వయం ఉపాధి అవకాశాలు పొందుతారని ప్రభుత్వం ఆశిస్తోంది.

• 2 నెలలుగా ఎదురుచూపు

జిల్లాలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఉచిత కుట్టు మిషన్ కోసం నిర్వాహకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉదయగిరి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంలో 136 మంది మహిళలు కుట్టు శిక్షణ పొందారు. అయితే శిక్షణ పూర్తయి 2 నెలలు గడుస్తున్నా ఇంత వరకు కుట్టు మిషన్ ఇవ్వకపోవడంతో నిర్వాహకుడ్ని ప్రశ్నిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కుట్టు మిషన్లు పంపిణీ చేయాలని శిక్షణ పొందిన మహిళలు కోరుతున్నారు.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం**

జిల్లాలో 31 కేంద్రాల ద్వారా మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటికే 26 కేంద్రాల్లో పూర్తయ్యింది. ఐదు కేంద్రాల్లోనూ శిక్షణ పూర్తవగానే, రెండో విడత శిక్షణ ప్రారంభమవుతుంది. శిక్షణ పూర్తయిన వారికి కుట్టు మిషన్ల పంపిణీ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం.

- నిర్మలాదేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ

**బంగారం కోసం ఘాతుకం**

చెముడుగుంటలో దారుణ హత్య 4

**రక్తదాతల్లారా.. స్పందించండి!**

ఏడాదికి 10వేల యూనిట్ల లోటు

నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం 6

## మరో ఇద్దరికి డైరెక్టర్ పదవులు

నెల్లూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్ల జాబితాలో జిల్లాలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరికి చోట దక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్లుగా నెల్లూరు రూరల్‌కు చెందిన మన్నెం పెంచలనాయుడు, ఉదయగిరికి చెందిన మధుసూదన్ తాళ్లపనేని నియమితులయ్యారు. కనీస వేతన సలహా మండలి చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి కూడా జిల్లాకు చెందిన వారే కావడం గమనార్హం. కాగా రాష్ట్ర బెస్త సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఉమ్మడి జిల్లాలోని గూడూరుకు చెందిన కొడిపర్తి శ్రీధర్, సూళ్లూరుపేటకు చెందిన పళని బొమ్మనలు నియమితులయ్యారు.



రాజరాజేశ్వరి ఆలయంలో ధ్వజస్తంభాన్ని మొక్కుతున్న మంత్రి ఆనం

## వేణుగోపాలస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులు 29న ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ పునః నిర్మాణ పనులు అక్టోబరు 29వ తేదీన ప్రారంభమవుతాయని రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా నగరంలోని రాజరాజేశ్వరి, మూలస్థానేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలను ఆనం సందర్శించి పూజలు చేశారు. వేణుగోపాలస్వామి ఆలయంలో పునఃనిర్మాణ పనుల మ్యాపులను పరిశీలించి, ఇంజనీర్లు, అధికారులకు పలు సూచనలు చేశారు. త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఈ పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ ఆలయాన్ని రూ.16.7 కోట్లతో అత్యంత అందంగా తీర్చిదిద్దుతున్నామన్నారు.

• 9 కోట్లతో ధ్యాన మందిరం, కల్యాణ మండపం

రాజరాజేశ్వరి ఆలయానికి చెందిన ఖాళీ స్థలంలో రూ.9 కోట్లతో కల్యాణ మండపం, ధ్యాన మందిర నిర్మాణాలు జరుగుతున్నాయని ఆనం తెలిపారు. ప్రతి దేవాలయంలో స్థానిక ఎమ్మెల్యే, ఆలయ పాలక మండలి అభిప్రాయం మేరకు అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు. రాజరాజేశ్వరి కల్యాణ మండపానికి దాతలు రూ.5కోట్లు ఇస్తున్నారని, మిగిలిన రూ.4కోట్లు దేవదాయ శాఖ నుంచి కేటాయిస్తున్నట్లు తెలిపారు.

## ట్రూఅప్ పోయింది.. ట్రూడౌన్ మొదలైంది!


• వైసీపీ హయాంలో కరెంటు బిల్లుల బాదుడు
• ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పెరిగిన చార్జీలు
• దిద్దుబాటు చర్యలు మొదలు పెట్టిన ప్రస్తుత ప్రభుత్వం
• నవంబరు నుంచి ట్రూ డౌన్ చార్జీలు • యూనిట్‌కు 13 పైసల తగ్గింపు?
• జిల్లా వినియోగదారులకు భారీ ఊరట
• నెలకు రూ. 6.24 కోట్లు, ఏడాదికి రూ.75 కోట్ల లబ్ధి

'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తాం కానీ పెంచం.' గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ ఇది. కాస్త ఆలస్యమైనా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. యూనిట్‌పై 13 పైసలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. నవంబరు నెల బిల్లు నుంచి తగ్గించిన చార్జీలు అమలులోకి రానున్నాయి. దీనివల్ల జిల్లాలో కరెంటు వినియోగదారులకు నెలకు రూ.6 కోట్లు, సంవత్సరానికి రూ.72 కోట్ల మేర మిగులు రూపంలో లబ్ధి చేకూరనుంది.

నెల్లూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా 11,94,474 ఎల్‌టీ సర్వీసులు ఉండగా, రోజుకు 1.50 నుంచి 1.70 కోట్ల యూనిట్ల విద్యుత్ వాడకం జరుగుతోంది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి సగటున ఏడాదికి రెండ్లు సార్లు చొప్పున మొత్తం 9 సార్లు ట్రూఅప్ చార్జీలు పెంచారు. దీంతో కరెంటు బిల్లు తడిసి మోపెడయ్యింది. పేద, మధ్య తరగతి వినియోగదారులు ఈ భారం భరించలేక అల్లాడిపోయారు. ప్రజల కష్టాన్ని గమనించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా ప్రజలకు మాట ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గేది తప్ప పెరిగేది ఉండదని స్పష్టం చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం విద్యుత్ రెగ్యులేటరీ కమిటీ (ఈఆర్‌సీ)తో చేసుకున్న ఒప్పందం కారణంగా ఏడాదిన్నర కాలంగా చార్జీలు తగ్గించే అవకాశం లేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ ఉత్పాదక రంగంలో అమలు చేసిన సంస్కరణల్లో భాగంగా డిస్కంలకు మిగులు ఏర్పడింది. ట్రుఅప్, ఇంధన సర్దుబాటు చార్జీలు ప్రతి ఏడాది ఆర్థిక సంవత్సరం ఆరంభంలో విద్యుత్ కొనుగోలు, సరఫరా వ్యయాన్ని అంచనా వేసి యూనిట్‌కు ఇన్ని పైసలు పెంచాలని డిస్కంలు ఈఆర్సీకి సిఫార్సు చేయడం, దానిని ఈఆర్‌సీ ఆమోదించడం, ఆ మేరకు వసూళ్లు చేయడం జరుగుతోంది. అయితే ఏడాది ఆఖరున విద్యుత్ ఉత్పాదక వ్యయం, నిర్ణయించిన ట్రూఅప్ చార్జీలను లెక్కగట్టి ఖర్చు పెరిగి ఉంటే ట్రూఅప్ చార్జీలను పెంచడం, ఖర్చు తగ్గి ఉంటే ఆ మొత్తాన్ని వినియోగదారులకు తిరిగి చెల్లించడం జరగాలి. అయితే ఖర్చు పెరిగినప్పుడు ట్రూఅప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలను పెంచతూ వెళ్లారు తప్ప మిగిలినప్పుడు ఆ లాభాలను డిస్కంలే పంచుకొంటూ వెళ్లేవి. అయితే చంద్రబాబు ప్రభుత్వం మిగులు మొత్తాన్ని ప్రజలకు పంచేయాలని నిర్ణయించుకుంది. దీని ఫలితంగా ట్రూ డౌన్ శకం మొదలయ్యింది. విద్యుత్ నియంత్రణ మండలి చరిత్రలో డిస్కంలు మిగులు మొత్తాన్ని ఇలా ప్రజలకు పంచేయాలని నిర్ణం తీసుకోవడం విద్యుత్ నియంత్రణ మండలి చరిత్రలో తొలిసారి కావడం గమనార్హం.

• నెలకు రూ.కోట్లలో మిగులు

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఫలితంగా నవంబరు బిల్లు నుంచి యూనిట్‌పై 13పైసలు తగ్గనుంది. ఇది జిల్లా ప్రజలకు పెద్ద ఊరట కలిగించనుంది. జిల్లా పరిధిలోని 11.94 లక్షల ఎల్‌టీ సర్వీసులు రోజుకు సగటున 1.60 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను ఖర్చు చేస్తున్నాయి. ప్రస్తుతం యూనిట్‌పై 40 పైసలు చొప్పున ట్రూఅప్ చార్జీలు వసూళ్లు చేస్తున్నారు. నవంబరు నుంచి ఒక యూనిట్‌పై విధించే 40 పైసలు ట్రూఅప్ చార్జీలో 13 పైసలు తగ్గుతుంది. ఒక యూనిట్‌పై 13పైసలు చొప్పున ఒక రోజు ఖర్చు చేసే 1.60 కోట్ల యూనిట్లపై లెక్కగడితే రోజుకు 20.80 లక్షల రూపాయల వరకు వినియోగదారులకు మిగులు ఏర్పడుంది. నెల రోజులకు లెక్కకడితే రూ.6.24 కోట్ల రూపాయల మేర జిల్లా ప్రజలకు మిగులు రూపంలో లబ్ధిచేకూరనుంది. ట్రూ డౌన్ ఏడాది కాలం కొనసాగితే జిల్లా ప్రజలకు సుమారు రూ. 75 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.




## జలాశయాలు ఫుల్.. అన్నదాత హ్యాపీ!

• నిండుకుండల్లా సోమశిల, కండలేరు డ్యాంలు
• గరిష్ఠ మట్టానికి చేరుకున్న నీటి నిల్వలు
• రెండు జలాశయాల్లో కలిపి 132 టీఎంసీల నిల్వ
• రానున్న రెండు సీజన్లకూ ఢోకా లేదు

నెల్లూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సహకారం, ప్రభుత్వ ముందుచూపుతో జిల్లాలోని జలాశయాలు కళకళలాడుతున్నాయి. వరుసగా రెండో ఏడాది కూడా సోమశిల, కండలేరు రిజర్వాయర్లు నిండుకుండల్లా మారాయి. ఎన్నడూ లేని విధంగా ఈదఫా రబీ సీజన్ ప్రారంభానికి ముందే రెండు జలాశయాలు నిండటం విశేషం. మరే జిల్లాలోనూ లేని విధంగా నెల్లూరు జిల్లాలో 132 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రానున్న రబీ సీజన్‌తోపాటు వచ్చే ఏడాది రెండో పంటను కూడా ఈ నీటితో పుష్కలంగా పండించుకోవచ్చు. ఈ ఫలాలు ఉమ్మడి నెల్లూరు జిల్లాతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కూడా అందనున్నాయి. సోమశిల పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలు కాగా ప్రస్తుతం దాదాపు 74 టీఎంసీలకు నీటిమట్టం చేరుకుంది. అలానే కండలేరు జలాశయం పూర్తి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతం 58 టీఎంసీలకు చేరుకుంది. జిల్లాలో వర్షాకాల సీజన్ ఇంకా ముందుండడంతో ఇంతకు మించి ఈ రెండు జలాశయాల్లో నీటి నిల్వ చేయడం మంచిది కాదని జలవనరుల శాఖ అధికారులు నిర్ణయానికి వచ్చారు. భవిష్యత్‌లో భారీ వర్షాలు, తుఫాన్లు వచ్చినా ఆ వరద నీటితో జలాశయాలకు ఇబ్బంది లేని విధంగా కుషన్ పెట్టుకొని జలాశయాలను నింపారు. ఇంకా సోమశిలకు 30 వేల క్యూసెక్కుల వరకూ ఇన్‌ఫ్లో నమోదవుతోంది. కండలేరుకు 10,500 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, దానిని 4 వేల క్యూసెక్కులకు తగ్గించారు. ఒకటీ రెండు రోజుల్లో పూర్తిగా ఆపేసే అవకాశాలున్నట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. ఇక పెన్నాలో వచ్చిన నీటిని వచ్చినట్లు సముద్రానికి వదిలేయనున్నారు.




ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలు

• ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో..

జిల్లాలో వర్షాకాల సీజన్‌కు ప్రారంభం ముందే రెండు ప్రధాన జలాశయాలు నిండటం చరిత్రగా ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. గతేడాది అపార్ తుఫాన్ తర్వాత డిసెంబరులో సోమశిల గరిష్ఠ మట్టానికి చేరుకున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఈ ఏడాది ముందుగానే కృష్ణా నదికి వరదలు పోటెత్తడంతో ప్రకాశం బ్యారేజీ నుంచి శ్రీశైలం వరకూ అన్ని జలాశయాలు నిండిపోయాయి. ఈ నేపథ్యంలో కృష్ణా జలాలను సోమశిలకు తరలించేందుకు ఇదే మంచి తరుణమన్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. ఆ వెంటనే జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించి ప్రభుత్వ స్థాయిలో మాట్లాడారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కృష్ణా జలాలను సోమశిలకు విడుదల చేసేందుకు కృషి చేశారు. తొలుత 4 వేల క్యూసెక్కులకు మించి విడుదల కాలేదు. మరోసారి 'ఆంధ్రజ్యోతి'లో 'వరదలున్నా వెలవెలే..' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈదఫా కూడా ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటి విడుదలను పెంచారు. ఆ తర్వాత క్రమేనా 15 వేల క్యూసెక్కుల వరకూ సోమశిలకు విడుదల కావడం ప్రారంభమైంది. ఇదే సమయంలో రాయలసీమ ప్రాంతంలో పెన్నా క్యాచ్‌మెంట్లో వర్షాలు కురవడం కూడా కలిసొచ్చింది. ఇలా మూడు నెలల కాలంలో 100 టీఎంసీలకుపైగా నీరు సోమశిల, కండలేరు జలాశయాలకు చేరింది.



**కొత్త మినగల్లు ఘటనపై హోంమంత్రి సీరియస్**

- వివరాలు 6లో..

### నేడు సామాజిక పెన్షన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ బుధవారం ప్రారంభమవుతుంది. 3,07,543 మందికి రూ.133.70 కోట్ల పెన్షన్‌ను పంపిణీ చేయనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పెన్షన్లను పంపిణీ చేస్తారని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు.

### సోమశిలకు 29,593 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి మంగళవారం 29,593 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. డ్యాంలో 73.187 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టన్నెల్ ద్వారా డెల్టాకు 2,650, క్రస్ట్‌గేట్ల ద్వారా 23,000 ఉత్తర కాలువకు 150, కండలేరుకు 4,000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

## దుర్గాదేవిగా శ్రీకన్యకాపరమేశ్వరి

పొదలకూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం దుర్గాదేవి అలంకారంలో శ్రీకన్యకా పరమేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమానికి ఉభయకర్తలుగా తన్నీరు పెద్ద మస్తానయ్య, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, హైమావతి వ్యవహరించారు.



### బంగారం, వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (22 క్యారెట్లు) | |
| ఒక గ్రాము ధర | రూ. 11057 |
| వెండి కిలో ధర | రూ. 147700 |
| వెండి ఒక గ్రాము | రూ. 151.70 |

## కరెంటు రామయ్య.. ఇంటిపై ట్రాన్స్‌ఫార్మర్



ఇంటి ముందుభాగంలో ట్రాన్స్‌ఫార్మర్ ఆకృతి

రాపూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పుర్రెకో బుద్ధి.. జిహ్వకో రుచి.. అన్నట్లుగా కొంతమంది ఆలోచనా శైలి భిన్నంగా ఉంటుంది. ఆ కోవకే వస్తుంది రాపూరులోని ఓ ఇంటి ముందు ఏర్పాటు చేసిన నిర్మాణం. గార్లపాటి సిద్దార్థ అనే విద్యుత్ ఉద్యోగి తన వృత్తిలో భాగమైన ట్రాన్స్‌ఫార్మర్ ఆకృతిని ఇంటి ముందు భాగంలో నిర్మించాడు. అతని తండ్రి రామయ్యను ఊరంతా కరెంటు రామయ్యా.. అని పిలిచేవారు. ఆయన రాపూరుకు సుమారు నలభై ఏళ్ల క్రితం కరెంటు వచ్చే సమయంలో స్తంభాలకు గుంతలు తవ్వే పనిలో చేరి, అనంతరం విద్యుత్‌శాఖలోనే సేవలందించారు. రామయ్య 2015లో కాలం చేశాక ఉద్యోగంలో చేరిన సిద్దార్థ వృత్తి ధర్మంలో భాగంగా ఇలా ఏర్పాటు పలువురిని ఆకర్షిస్తున్నది

## అధ్వానంగా కందలపాడు రోడ్డు

- ప్రజల రాకపోకలకు ఇబ్బందులు
- కొంతమేర రోడ్డు వేస్తే సులభంగా ప్రయాణం

వెంకటాచలం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందలపాడు రోడ్డు అధ్వానంగా ఉంది. కసుమూరు, వెంకటాచలం రోడ్డు నుంచి ఈ గ్రామానికి ఇరవై ఏళ్ల కిందట తారురోడ్డు వేశారు. అప్పట్లో నాసిరకంగా రోడ్డు వేయడంతో పూర్తిగా శిథిలమైపోయింది. అనంతరం రెండవ సారి 2013లో రెండు కిలోమీటర్ల మేరతారు వేశారు. అది కూడా అంతంతమాత్రంగానే వేయడంతో దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. 2023లో దెబ్బతిన తారు రోడ్డును తొలగించి తాత్కాలికంగా కంకర పరిచి రోడ్డు వేశారు. ప్రస్తుతం ఈ రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే నరకయాతనే. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా కర్రతుమ్మ చెట్లు పెరిగి ప్రయాణికులకు, వాహనచోదకులకు ఇబ్బందిగా మారాయి. రోడ్డు సరిగా లేకపోవడంతో ఆటోవాళ్లు కూడా గ్రామానికి రావడానికి జంకుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు వెంట నెల్లూరు రూరల్ మండలంలోని నాంచారమ్మ గిరిజనకాలనీ, దొంతాలి, అప్పయ్యకండ్రిగ గామాలతోపాటు ఆమంచర్ల గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రోడ్డును బాగు చేయాల్సిన అవసరం ఉంది. కాగా వెంకటాచలం - కసుమూరు రోడ్డు నుంచి కందలపాడు మీదుగా సుమారు 5 కిలోమీటర్లు తారురోడ్డు వేసినట్లయితే రాకపోకలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఆదిశగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని తారు రోడ్డును నిర్మించాలి.



గుంతలతో అధ్వానంగా ఉన్న కందలపాడు రోడ్డు

## వర్షాల్లో నిమ్మసాగు.. జాగ్రత్తలు

పొదలకూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల కారణంగా మూడురోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి.ఈ నేపథ్యంలో వానలు పడినపుడు నిమ్మ సాగు చేసే రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పొదలకూరు ఉద్యానశాఖాధికారి ఈ.ఆనంద్ తెలిపారు. పాదుల్లో నీళ్లు నిలిచి చెట్లు చనిపోయే ప్రమాదం ఉందని, తెగుళ్లు సోకి కాయ దిగుబడి కూడా తగ్గిపోతుందని ఆయన తెలిపారు. ఇందుకుగాను నివారణ చర్యలను ఆయన వివరించారు.



● నిమ్మ చెట్లు దెబ్బతినకుండా...

ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసిన సమయంలో నిమ్మ తోటల్లో నీరు నిలిచిపోతుంది. అలా చేరిన నీటిని బయటకు పంపాలి. వేరు వ్యవస్థకు ఎండ తగిలేలా ఏర్పాట్లు చేయాలి. పడిపోయిన చెట్లను యథాస్థితికి తెచ్చి ఊతం ఇచ్చి సరిగా నిలబడేలా చూడాలి. బయటకు వచ్చిన వేర్లను మట్టితో కప్పి అదమాలి. విగిరిన కొమ్మలను కత్తిరించి పైభాగాన బోర్డో మిశ్రమం పూయాలి. 8 ఏళ్ల పైబడి కాపువస్తున్న తోటల్లోని చెట్లకు 500గ్రా. యూరియా, లేదంటే 750 గ్రాముల పొటాష్ వేయాలి. చెట్టు మొదళ్ల దగ్గర ఒక శాతం బోర్డో మిశ్రమం లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా లీటర్ నీటికి కలిపి పూయాలి. తోటల్లో కాయ ఉన్నప్పుడు 2-4డి మందును 1గ్రా. 100లీటర్ల నీటికి కలిపి, లేదా ప్లానోఫిక్ మందును 2.5మి.లీ 10లీటర్లలో కలిపి పిచికారీ చేయాలి. పిందెలు, కాయలు రాలకుండా చూసుకుంటే దిగుబడులు సాధించవచ్చని ఆనంద్ తెలిపారు.

## రాజ్యలక్ష్మి అలంకరణలో ఆదిలక్ష్మి

రాపూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన ఆలయంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీవారి పట్టమనిషి ఆదిలక్ష్మికి రాజ్యలక్ష్మి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో అర్చకులు అమ్మవారిని రాజ్యలక్ష్మి అలంకరణలో తీర్చిదిద్ది భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం అమృతాభిషేకాలు, పట్టువస్త్రాలు, పలు రకాల పూలతో అలంకరించి, శ్రీవారి నందనవనంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం సాముహిక కుంకుమార్చనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే కోనలోని శ్రీమాతృదేవి విశ్వశాంతి ఆశ్రమం లో నిత్యాభిషేకాలు, నవరాత్రి హోమాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం అష్టమి సందర్భంగా స్వామివారు వ్యాఘ్ర వాహనంపై (పులి) భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శ్రీదుర్గా సూక్తహోమం, నక్షత్ర హోమాలను విజయేశ్వరిదేవి భక్తుల మధ్య నిర్వహించారు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న విజయేశ్వరిదేవి

### వైభవంగా లలితారుద్ర మహాయజ్ఞం

**సంగం :** స్థానిక తిరుమన కొండలోని శ్రీరాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం చేపట్టిన 45 రోజుల లలితారుద్ర మహాయజ్ఞం మంగళవారం నాటికి ఎనిమిదవ రోజుకు చేరింది.

## యూరియా పంపిణీ

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్మవారిపాళెం సొసైటీ కార్యాల య గోదాములో మంగళవారం సొసైటీ చైర్మన్ పేలపూడి వెంకటరత్నం, మండల వ్యవసాయాధికారి మదన్ మోహన్ రైతులకు యూరియా పంపిణీ చేశారు.

## చెముడుగుంటలో దారుణ హత్య

- బంగారం కోసమేనన్న అనుమానాలు
- మృతదేహాన్ని పరిశీలించిన రూరల్ డీఎస్పీ

వెంకటాచలం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడుగుంట పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారికి కూతవేటు దూరంలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మంగళవారం సాయంత్రం స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల కథనం మేరకు, బుజబుజనెల్లూరులోని న్యూ కాలనీలో వల్లూరు మల్లికార్జున్ కుటుంబం నివాసం ఉంటోంది. కొంతకాలం నుంచి అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న మల్లికార్జున్ ఇటీవల కొంతవరకు కోలుకున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయిన మల్లికార్జున్(55) జిల్లా జైలుకెళ్లే మార్గంలో శవమై తేలాడు.



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మల్లికార్జున్



ఘటనాస్థలంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు సుబ్బారావు, శ్రీనివాసరావు

● మృతిపై అనుమానాలు

కాగా మల్లికార్జున్ ఎవరితో గొడవపడే వ్యక్తికాదని, చాలా మంచోడని, అలాంటి వ్యక్తి ఇలా అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. మృతుడు ఎప్పుడూ చేతికి ఉంగరాలు, మెడలో బంగారు చైను ధరించి ఉంటాడని, కానీ అవి కనిపించకుండా పోవడంతో ఎవరైనా బంగారం కోసం హత్య చేసి ఉంటారన్న అనుమానం స్థానికుల్లో కలుగుతోంది. మృతుడి మెడ చుట్టూ టెంకాయ నారతాడు చుట్టి ఉండటం, ముఖంపై గాయాలతోపాటు తీవ్రస్థాయిలో దెబ్బలు తగిలి ఉండటం, తల పక్కనే బండరాయి కనిపించడంతో ఎవరో కిరాతకంగా హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● ఫొటోలు తీయకూడదు..

విషయం తెలుసుకున్న రూరల్ డీఎస్పీ జీ. శ్రీనివాసరావు, వెంకటాచలం, వేదాయపాళెం సీఐలు వీ సుబ్బారావు, శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీం నిపుణులను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించి చుట్టుపక్కల గాలించారు. కానీ మీడియాని రానివ్వకుండా అత్యంత గోప్యంగా కేసు దర్యాప్తు చేపట్టారు. ఇలాంటి ప్రాంతాలకు మీడియా రాకూడదని, తమ అనుమతి లేకుండా ఫొటోలు కూడా తీయరాదంటూ చెబుతూ మీడియాకి పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఎక్కడా లేని విధంగా కొత్త నిబంధనలు పెట్టిన పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● ఎస్పీ అజిత పరిశీలన

జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల మంగళవారం రాత్రి సంఘటనా స్థలాన్ని పరిశీలించి హత్యకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు.

## సోదరిపై అన్న కుటుంబ సభ్యుల దాడి

కావలిరూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కావలి మండలం అన్నగారిపాలెంకు చెందిన జెడ్డా చిన్నమ్మపై ఆమె అన్న గోళ్ల పొట్టియ్య, అతని భార్య తిరుపతమ్మ, కుమారుడు నవీన్‌లు మంగళవారం దాడి చేసి గాయపరిచారు. పోలీసుల కథనం మేరకు.. అన్న పొట్టియ్య కుమారుడు నవీన్‌కు వస్తున్న పెళ్లి సంబంధాలను చెల్లెలు చిన్నమ్మ చెడకొడతుందనే అనుమానంతో కుటుంబ సభ్యులు ఆమెపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు రూరల్ పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గేదె చోరీపై కేసు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఖాళీ స్థలంలో కట్టేసిన గేదెను ఇద్దరు దుండగులు దొంగలించుకు వెళ్లిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూరులోని పడారుపల్లి చలపతినగర్‌లో ఎం ప్రభాకర్ గేదెలను పెంచుతూ పాల వ్యాపారం చేసుకుంటున్నారు. ప్రతీ రోజు గేదెలను తన ఇంటిముందున్న ఖాళీస్థలంలో కట్టేసేవారు. ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు గుర్తుతెలియని దుండగులు గేదెను అపహరించుకుని వెళుతుండటాన్ని గూర్ఖా చూసి బాధితునికి తెలియజేశారు. ప్రభాకర్ సీసీ కెమెరాలను పరిశీలించగా నిందితులు సుందరయ్యకాలనీకి చెందిన ముంజునాథ్, వెంకటేష్‌గా గుర్తించారు. వారి కోసం గాలించినా జాడ తెలియకపోవడంతో మంగళవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 9 సవర్ల బంగారం, 250 గ్రాముల వెండి అపహరణ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ఎఫ్‌సీఐ కాలనీ సమీపంలోని కృష్ణానగర్‌లో వెంకట వరప్రసాద్ కుటుంబం నివసిస్తోంది. ఆయన వేదాయపాలెం నారాయణ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 27వ తేదీన ఆయన కుటుంబంతో హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఆయన ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలోని సుమారు తొమ్మిది సవర్ల బంగారు ఆభరణాలు, పూజగదిలోని 250 గ్రాముల వెంటి వస్తువులు అపహరించుకుని వెళ్లారు. మంగళవారం ఇంటికి వచ్చిన బాధితులు చోరీ జరిగినట్లు గుర్తించి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహిత మెడలోని గొలుసు చోరీ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుడి నుంచి భర్త, కుమార్తెతో కలిసి బైక్‌పై వెళుతున్న వివాహిత మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు తెంపుకెళ్లిన ఘటన రాంజీనగర్‌లో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన లక్ష్మి, అశోక్‌రెడ్డి దంపతులు సోమవారం రాత్రి కుమార్తెను తీసుకుని రాజరాజేశ్వరి గుడికి వెళ్లారు. అమ్మవారిని దర్శించుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరారు. రాంజీనగర్ వద్దకు వచ్చేసరికి వర్షం వస్తుండటంతో ఓ దుకాణం వద్ద ఆగారు. వర్షం తగ్గిన వెంటనే బయలుదేరారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు బైక్‌ను వెంబడించి లక్ష్మి మెడలోని 4 సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. ఊహించని ఈ పరిణామంతో ఖంగుతిన్న బాధితులు తేరుకుని దుండగులను వెంబడించే ప్రయత్నం చేశారు. అప్పటికే వారు పరారయ్యారు. బాధితులు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళ అదృశ్యం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాంట్రాక్టు ఉద్యోగిని అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూరు నగరానికి చెందిన ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. ఈ నెల 25వ తేదీ విధులకు వెళ్లిన ఆమె అక్కడ నుంచి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు గాలించినా ప్రయోజనం లేకపోవడం, ఆమె ఫోన్‌సైతం స్విచ్ ఆపి ఉండటంతో సోమవారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

● మాజీ మంత్రి కాకాణి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు,కార్యకర్తలు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని వీఆర్సీ కూడలి వద్దనున్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. జగన్ రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకొస్తే... చంద్రబాబు వాటినీ ప్రైవేటు పరం చేస్తున్నారని కాకాణి విమర్శించారు. ఈ కార్యక్రమంలో మేరిగ మురళీధర్, నాయకులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ దోపిడీకి అడ్డుకట్ట

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లు, జొన్నవాడ ఇసుక రీచ్‌లలో అక్రమ ఇసుక దోపిడీకి అడ్డుకట్టకు మంగళవారం పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సీఐ శ్రీనివాసులురెడ్డి తమ సిబ్బందితో జొన్నవాడ, మినగల్లు ఇసుక రీచ్‌లలోకి వాహనాలు వెళ్లకుండా ఆయా మార్గాలలో 4చోట్ల గోతులు తీసి సిబ్బందితో కాపలా ఏర్పాటు చేశారు.

## మిస్ సౌత్ ఇండియా టైటిల్ విన్నర్ నవీనశెట్టి



నెల్లూరు (సాం స్కృతికం) సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీలోని రెడిసన్ బ్లూవో ప్రైడ్ ఆఫ్ ఇండియా ఇటీవల నిర్వహించిన మిస్ సౌత్ ఇండియా పోటీల్లో నగరానికి చెందిన నవీనశెట్టి (26) టైటిల్ విన్నర్‌గా నిలిచింది. మనుమసిద్ధినగర్ తీర్థా స్కూల్ ఫౌండర్ సాయికుమారి, సప్తస్వర ఆర్కెస్ట్రా ఫౌండర్ ద్వారకానాథ్‌ల కుమార్తె నవీనశెట్టి చిన్ననాటి నుంచే చదువుతోపాటు నృత్యం, ఐక్యత తదితర రంగాలలో చురుకుగా వ్యవహరించేది. ఇప్పుడు మిస్ సౌత్ ఇండియా టైటిల్ విన్నర్‌గా నిలవడంతో పలువురు నవీన శెట్టిని అభినందించారు.

## జీఎస్టీ తగ్గింపును ప్రజల్లోకి తీసుకెళ్లండి

వింజమూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీని కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచించా రు. వింజమూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని 122 మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం డీఎస్సీ ద్వారా నియోజకవర్గంలో 199 మందికి టీచర్ పోస్టులు ఇచ్చిందని ఆయన తెలిపారు.బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యర్తలు కేంద్ర రాష్ట్ర ప్రభు త్వ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు.

## దుర్గాదేవి అలంకరణలో కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయంలో జరుగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా కామాక్షితాయి దుర్గాదేవి అలంకారంలో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకం, నవావరణ పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కాళరాత్రి నవావరణ పూజలు చేసి కొలువులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలు పెద్దఎత్తున దుర్గాదేవికి రాహుకాల దీపారాధనలతో పూజలు చేశారు. దుర్గాదేవిగా కొలువుదీరిన కామాక్షితాయి ఉత్సవమూర్తికి చేసిన ప్రత్యేక పుష్పాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

● నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహర్నవమి సందర్భంగా కామాక్షితాయి మహిషాసురమర్ధిని అలంకారములో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



త్రివిక్రమ అలంకరణలో కోదండరాముడు

● కోదండరామస్వామి ఆలయంలో..

బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో కొలువైవున్న సీతా, లక్ష్మణ సమేత కోదండరామస్వామి, ఆలయంలో కోదండరాముడు త్రివిక్రమ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం పట్టాభిషేకంలో స్వామివారు దర్శనమివ్వనున్నారు.

● ధైర్యలక్ష్మిగా కల్యాణ వేంకటేశ్వరుడు

బుచ్చిరెడ్డిపాళెం రామకృష్ణానగర్‌లో కొలువైవున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కళ్యాణ వేంకటేశ్వరుడు ధైర్యలక్ష్మి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం రాజ్యలక్ష్మి అలంకారములో దర్శనమివ్వనున్నారు.

## జనరేషన్ జెడ్.. వీళ్ల రూటే వేరు!

జనరేషన్ జెడ్.. ఈతరం వాళ్ల మాటతీరు.. ఆలోచన, బిహేవియర్, కెరీర్ గోల్స్, లైఫ్‌స్టైల్.. ఇలా ఏ విషయం తీసుకున్నా అన్నింటిలోనూ తాము డిఫరెంట్ అనిపించుకుంటున్నారు. ఉద్యోగం, సంపాదన, పొదుపు.. అంతెందుకు పెళ్లి విషయంలో కూడా మిగతా తరాల వాళ్లకంటే భిన్నంగా ఉన్నారు. అధునాతన స్మార్ట్‌ఫోన్లు విరివిగా వినియోగించే ఇంటర్నెట్ యుగంలో జన్మించిన వారే జెన్ జెడ్ కేటగిరీకి చెందినవారు. వీరు ప్రపంచాన్ని భిన్నంగా చూస్తారు. ఆన్‌లైన్‌లో స్నేహితులను కలుసుకోవడానికి, భౌతికంగా స్నేహితులను కలుసుకోవడానికి తేడా లేదని నమ్మే జనరేషన్. మరి ఇలాంటి వాళ్లతో భవిష్యత్తు ఎలా ఉండబోతోందన్న అంశంపై ఇప్పటికే పలు సంస్థలు సర్వేలు నిర్వహించగా వాటిలో ఇచ్చిన రిపోర్ట్స్ ఆధారంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

\- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

● పుడుతూనే సెల్‌ఫోన్.. ఎదుగుతూ హైస్పీడ్ ఇంటర్నెట్

1996 నుంచి 2012 మధ్య పుట్టిన వాళ్లను జనరేషన్ జెడ్ అని పిలుస్తారు. మిలేనియల్స్‌కి, వీళ్లకీ చాలా తేడా ఉంటుంది. దేశ అభివృద్ధిలో వీళ్లదే ప్రధాన పాత్ర అని ఒక వైపు చెబుతూనే.. మరోవైపు వీళ్లతో అంత ఈజీ కాదు అంటున్నారు. ఎందుకంటే వీళ్లు అంచెలంచెలుగా మారుతున్న ఆధునిక సామాజిక పరిస్థితులను చూస్తూ పెరిగారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ముందున్నారు. వీళ్లకంటూ ఒక కొత్త ఫిలాసఫీనే క్రియేట్ చేసుకున్నారని చెప్పవచ్చు. ఈతరం వాళ్లు డిజిటల్ యుగంలో పుట్టి, టెక్నాలజీ, ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్, సోషల్‌మీడియా వంటి వాటిని ఉపయోగిస్తూ పెరిగారు. కాబట్టి వీళ్లను 'డిజిటల్ నేటివ్స్' అని కూడా అంటారు. ముందు తరాలతో పోలిస్తే ప్రతి విషయాన్ని కొత్త కోణంలో చూస్తున్నారు. రోజుకు 8 గంటల పని, పదేళ్లకుపైగా ఒకే ఉద్యోగం, ఓవర్ టైమ్ వర్క్, సెలవుల కోసం మేనేజర్ ముందు నిలబడి అడగడం వంటి వాటికి వీళ్లు చాలా దూరం. వీళ్లకు ఎక్కడ పనిచేస్తున్నామన్నది పాయింటే కాదు.. ఎప్పుడు ఎలా వర్క్ చేస్తున్నామన్నదే ఇంపార్టెంట్.



● డిజిటల్ ప్రపంచమే తమ లోకం..

జనరేషన్ జెడ్ వాళ్లంతా ఆధునాతన స్మార్ట్‌ఫోన్లు వినియోగించే ఇంటర్నెట్ యుగంలో జన్మించారు. గత తరాలతో పోలిస్తే స్నేహశీలురుగా మెలుగుతూ, ప్రపంచాన్ని భిన్నంగా చూస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా వర్క్‌ఫ్రమ్ హోం, తమకు నచ్చిన టైమ్‌లో పనిచేయడం, ఫ్రీలాన్సింగ్ ప్రాజెక్టులు చేయడానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే వీరికి జీతం ఎంత అనేది ముఖ్యం కాదు. చేస్తున్న జాబ్‌లో తమ టాలెంట్ ఎలా ఉంది, ప్రపంచానికి ఎలా కనిపిస్తుంది అనే పర్సనల్ బ్రాండింగ్‌కు ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. అయితే కొన్ని విషయాల్లో వీళ్లు చాలా బెటర్‌గా ఉన్నారని తెలుస్తోంది. ఐక్యరాజ్య సమితి అంచనాల ప్రకారం ప్రస్తుత జనరేషన్ జెడ్ జనాభా 10 కోట్లు.. ఈ తరంలో 25శాతం సామాజిక బాధ్యత కలిగి ఉన్నారు.

ఆర్థిక మాంద్యం పరిస్థితులు ఎదుర్కొన్న వాళ్లు కాబట్టి డబ్బులను పొదుపు చేయాలని ఆలోచిస్తున్నారు. అంతేకాదు సహనం కూడా ఎక్కువే. అయితే, వీళ్లలో మానసిక సమస్యలూ ఎక్కువేనని, 35 శాతం మంది కుంగుబాటుతో బాధపడుతున్నారని నిపుణులు చెబుతున్నారు.

● కొత్త స్కిల్ నేర్చుకోవాలనే తపన

ఉడెమీ రిపోర్ట్ ప్రకారం 98శాతం జెన్ జెడ్‌లు వారానికి ఒక గంట ఏదైనా స్కిల్ నేర్చుకోవడానికి టైమ్ కేటాయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంటెంట్‌కి పాపులారిటీ పెరుగుతుండడంతో దానికి ఎక్కువగా అట్రాక్ట్ అవుతున్నారు. మిలేనియల్స్‌తో పోలిస్తే 93 శాతం ఎక్కువ అంకితభావం కలిగి ఉన్నారు.

● తమకు తామే బాస్

సాంటాండర్ యూకే రీసెర్చ్‌లో జెన్‌జెడ్‌ల గురించి అనేక విషయాలు తెలిపారు. ఒకరి కింద పని చేయడం కన్నా తమకు తామే బాస్‌గా ఉండడానికి ఇష్టపడుతున్నారు. కొత్త బిజినెస్ స్టార్ట్ చేసి సక్సెస్‌ఫుల్‌గా రన్ చేస్తామనే నమ్మకం ఉందని 77శాతం మంది తెలిపారు. 39 శాతం మంది తమ దగ్గరున్న స్మార్ట్‌ఫోన్‌తోనే వ్యాపారాలు ప్రారంభిస్తామని చెప్పారు. 2021లో యెర్నెస్ట్ అండ్ యంగ్ చేపట్టిన సర్వేలో సొంతంగా ఒక పని మొదలు పెట్టేందుకు తాము ఎక్కువ ఆసక్తితో ఉన్నట్లు 45 శాతం చెప్పడంతో పాటు నేడు వాటిని అవలంబిస్తున్నారు.

● సెక్యూరిటీ ఇంపార్టెంట్...

గతంలో అమ్మాయి, అబ్బాయి కలిసి బయటకు వెళ్లాలంటే ఎవరూ లేని ప్రాంతాలను ఎంచుకునే వాళ్లు. ఇప్పుడలా కాకుండా జెన్‌జెడ్ యూత్ కెఫేలు, షాపింగ్‌మాల్స్ రెస్టారెంట్స్ వంటి పబ్లిక్ ప్లేస్‌లను సెలక్ట్ చేసుకుంటున్నారు. టూర్‌లకు వెళ్లాలంటే గ్రూప్ ట్రిప్‌లకు ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. అవతలి వాళ్ల నుంచి ఏం ఆశిస్తున్నారో కూడా ముందే చెప్పుకునేంత క్లారిటీ మెయింటెయిన్ చేస్తున్నారు.

● అనుభవానికే ప్రాధాన్యం

డెలాయిట్ కంపెనీ 2025 డెలాయిట్ గ్లోబల్ జెన్‌జెడ్ అండ్ మిలీనియల్ సర్వే చేసింది. అందులో 809 ఇండియన్ ప్రొఫెషనల్ ఎక్స్‌పర్ట్స్, 505 మంది జెన్‌జెడ్‌లు, 304 మంది మిలీనియల్స్ నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. దాని ప్రకారం దేశంలోని 30 ఏళ్లలోపు జెన్‌జెడ్, 45 ఏళ్లలోపు మిలేనియల్స్ ప్రొఫెషనల్ నిర్ణయాల్లో కెరీర్ డెవలప్‌మెంట్, లెర్నింగ్ ఆపర్చునిటీస్‌కే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. భవిష్యత్తులో అవసరమయ్యే వాటికి అనుగుణంగా మారుతున్నారు. నైపుణ్యాలను ఎప్పటికప్పుడు డెవలప్ చేసుకుంటున్నారు. వారానికి ఒకసారి స్కిల్ డెవలప్ చేసుకోవడానికి 85 శాతం మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతమున్న జాబ్ మార్కెట్ గురించి మాత్రం కొన్ని అనుమానాలున్నాయంటున్నారు జెన్‌జీలు 94 శాతానికిపైగా జెన్ జెడ్‌లు, 97 శాతం మిలీనియల్స్ థియరీ కంటే ప్రాక్టికాలిటీ, అనుభవానికే వాల్యూ ఇస్తున్నారు. 52 శాతం జెన్‌జెడ్‌లు, 45 శాతం మిలీనియల్స్ క్వాలిటీ ఎడ్యుకేషన్ అందట్లేదని చెబుతున్నారు. 33 శాతం జెన్‌జెడ్‌లు, 29 శాతం మిలేనియల్స్ ఎక్కువ సమయం ఒత్తిడికి గురువుతున్నట్లు తెలిపారు. అందులో జాబ్ పరంగా ఒత్తిడికి గురయ్యేవాళ్లే ఎక్కువ ఉన్నారని సర్వే సంస్థలు వెల్లడిస్తున్నాయి.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 125 |
| స్కిన్ చికెన్ | 228 |
| స్కిన్‌లెస్ | 250 |

కోడిగుడ్ల ధర (100) : 530

## 3న రామలింగాపురం అండర్ బ్రిడ్జి పునఃప్రారంభం

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామలింగాపురం వద్ద రూ.1.17 కోట్లతో ఆధునికీకరించిన అండర్ బ్రిడ్జి మార్గాన్ని ఈ నెల 3వ తేదీన పునఃప్రారంభిస్తున్నట్లు టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆ బ్రిడ్జి వద్ద జరుగుతున్న తుది నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి చక్రవర్ధన్‌రెడ్డి, నాయకులు మదన్ కుమార్ రెడ్డి, విష్ణుప్రియ పాల్గొన్నారు.

## 8 గంటల పని విధానాన్నే కొనసాగించాలి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని, 13 గంటల పనివిధానం వద్దని, 8 గంటల పని దినాలే కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జిలాని ఖాన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 139 సంవత్సరాల క్రితం పోరాడి సాధించుకున్న 8 గంటల పనివిధానాన్ని రద్దు చేయటం, ఓవర్ టైం డ్యూటీని పెంచటం, మహిళ కార్మికులకు రాత్రి డ్యూటీలు కేటాయించటం దుర్మార్గమని తెలిపారు. వీటిపై ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.


లలితా పరమేశ్వరిగా గ్రామదేవత ఇరుకళమ్మ


కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిమ్మకాయలతో విశేష అలంకరణ


గురువాయురప్పన్ ఆలయంలో వైష్ణవీదేవిగా ఆదిలక్ష్మి


బ్రహ్మంగారి ఆలయంలో మహిషాసురమర్దిని


ఇరుకళమ్మ గుడిలో చిన్నారుల నృత్య ప్రదర్శన


రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ

# జయ దుర్గే... హర దుర్గే !

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో మంగళవారం దుర్గాష్టమి పర్వదినం వైభవంగా జరిగింది. నగరంలోని ఆలయాల్లో అమ్మవార్లు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

● రాజరాజేశ్వరి అమ్మవారు దుర్గమ్మగా పూజలందుకున్నారు. నవావరణ పూజ, సంపుటీకరణ చండీ హోమాలు జరిగాయి. ● కన్యకా పరమేశ్వరికి దుర్గాదేవి అలంకారం వైభవంగా జరిగింది. ఆలయానికి, మూలవర్లకు కుంకుమ, నిమ్మకాయలతో చేసిన అలంకరణ ఆకట్టుకుంది. ● గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు లలితా పరమేశ్వరి గా దర్శనమిచ్చారు. అభిషేకాలు, నవావరణ, ఖడ్గమాల పూజలు జరిగా యి. సాయంత్రం చిన్నారిని ఇరుకళల పరమేశ్వరిగా అలంకరించి బాల పూజ చేశారు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజితమ్మ, మాజీ మేయర్ భానుశ్రీ పాల్గొన్నారు. ● మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో భువనేశ్వరీ దేవికి దుర్గా అలం కారం జరిగింది. మూలవర్లకు గాజులతో అలంకారం భక్తులను ఆకట్టుకుంది. నవావరణ పూజ, పూలంగిసేవ, చండీ హోమం జరిగాయి. ● మూలాపేట శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదీ దేవి దుర్గ మ్మగా దర్శనం ఇచ్చింది. విరాట్‌నగర్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం లో గాయత్రిదేవికి మహిషాసురమర్దిని అలంకరణ జరిగింది. ● కోదండరామపురం మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి దుర్గా అలంకా రం జరిగింది. కుంకుమపూజ, అన్నప్రసాద వితరణ చేశారు. ● పప్పుల వీధి మహాలక్ష్మి ఆలయంలో దుర్గాదేవి అలంకారం జరిగింది. మహామేరు కు పంచామృతాభిషేకం, విష్ణు సహస్ర నామ పారాయణం, ఊంజల్ సేవ జరిగాయి. ● బాలాజీనగర్ సీతారామ మందిరంలో సీతాదేవికి భవానీ అలంకా రం జరిగింది. ఉదయం ధనలక్ష్మీ హోమం, సాయంత్రం అష్టలక్ష్మీ వైభవం జరిగాయి. ● సిద్ధి విఘ్నేశ్వరాలయంలో అమ్మవారికి దుర్గాదేవి అలంకారం జరిగింది. దుర్గాపూజ, ఖడ్గమాల అర్చన, సువాసినీ, ఆయుధ పూజ చేశారు. ● అయ్యప్పగుడిలోని గురువాయురప్పన్ మహా విష్ణువు ఆలయంలో ఆదిలక్ష్మికి వైష్ణవీదేవి అలంకారం జరిగింది. ● వేదగిరి క్షేత్రంలో ఆదిలక్ష్మి అమ్మవారు ధనలక్ష్మీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. నృసింహ స్వామిని యోగ నరసింహస్వామిగా అలకరించి ప్రత్యేక పూజలు చేశారు.


బాల పూజ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి

### ఆలయాల్లో మంత్రి నారాయణ సతీమణి

స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి, బలిజపాళెం మహాలక్ష్మి, కనకమహాలక్ష్మీ ఆలయాలను పురపాలక మంత్రి పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. నిమ్మకాయల అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 310పేజీలతో రూపొందించిన అమ్మవారి సావనీర్‌ని ఆలయ కమిటీ ఆవిష్కరించింది.

## నగరంలో మంత్రి ఆనం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దుర్గాష్టమి సందర్భంగా నగరంలోని పలు దేవాలయాలను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సందర్శించారు. తొలుత రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డితో కలిసి రాజరాజేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. అనంతరం మూలస్థానేశ్వరాలయం సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఈవోలు అర్వభూమి శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసురావులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్‌లు, కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


రాజరాజేశ్వరి ఆలయంలో ఆలయ మర్యాదలు అందుకుంటున్న మంత్రి ఆనం, తదితరులు



## డాక్టర్ జ్యోతి కేసును ప్రత్యేకంగా దర్యాప్తు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో 4వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న డాక్టర్ జ్యోతి కేసును ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు చెన్న కేశవులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని జర్నలిస్టు భవన్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అప్పట్లో డాక్టర్ జ్యోతి ఆత్మహత్యపై శవపంచనామా కూడా జరగలేదని ఆరోపించారు. ఆమె భర్త పెనుబాక రవిబాబు కేసు పెట్టలేదని తెలిపారు. దీనిపై అనేక అనుమానాలున్నాయని, నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆమె తల్లిదండ్రులు పబ్లిక్ గ్రీవెన్స్‌లో కోరి ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు స్వర్ణా వెంకయ్య, పాలేటి కోటేశ్వరరావు, జీ ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ... గృహ అక్రమాలు అరికట్టండి

● బాపూ విగ్రహానికి బీజేపీ వినతి


గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న రమేష్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణ శాఖలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ బీజేపీ నాయకుడు మిడతల రమేష్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లోని గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 8 లక్షల గృహాలు అసంపూర్తిగా ఉన్నాయని, పూర్తయిన ఇళ్లలో కనీస వసతులు లేనందున లబ్ధిదారులు వాటిలో చేరటం లేదన్నారు. తట్ట మట్టి పోయకుండా లెవలింగ్ నిధులు దారి మళ్లించారని ఆరోపించారు. రాష్ట్ర గోడౌన్లలో నిల్వ ఉండి తుప్పుపట్టిన స్టీల్ విలువ రూ.115 కోట్లు ఉంటుందని చెప్పారు. ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుధవారపు బాలాజీ, అల్లూరు నాగేంద్రసింగ్, సృజన, పద్మ, రాములు యాదవ్, నారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని ఓర్వలేకే విమర్శలు : టీడీపీ

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి ఓర్వలేక ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారని టీడీపీ నగర మహిళా అధ్యక్షురాలు కప్పిర రేవతి ఆరోపించారు. మంగళవా రం సంతపేట మార్కెట్‌లో అగ్నిప్రమాద బాధితులను స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులుతో కలిసి నాయకులు పరామర్శించారు. లక్ష రూపాయల నగదు, బియ్యం బస్తాలు అందచేశారు. రేవతి మాట్లాడుతూ దురదృష్టవశాత్తు పాత దుస్తుల దుకాణంలో అగ్నిప్రమాదం జరిగి వ్యాపా రులకు నష్టం వాటిల్లిందని, మంత్రి వెంటనే స్పందించారని చెప్పారు. అయినా మంత్రిపై ఎమ్మెల్సీ ఇష్టానుసారంగా విమర్శలు చేయడం సరికాదన్నారు.

## గ్యాస్ సిలిండర్ బాధితులకు అండగా ఉంటాం

● నూర్‌బాషా దూదేకుల సంఘం నాయకులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్ వేపచెట్టు ప్రాంతంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ దెబ్బతిన్న కాజా రంతుల్లా ఇంటిని నూర్‌బాషా-దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం పరిశీలించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు సుభాన్ బాషా, జహీర్, సందానీ బాషా, మహిళా అధ్యక్షురాలు మస్తానమ్మ, హబీబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి బ్రెజిల్ బృందం

## ప్రకృతి సేద్య క్షేత్ర సందర్శన

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ (ఏపీసీఎన్‌ఎఫ్) నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలించేందుకు బ్రెజిల్, శ్రీలంక, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన 30 మంది సభ్యుల బృందం బుధవారం నుంచి పది రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనుంది. ప్రకృతి వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలు, గ్రామీణ సమూహాల చైతన్య ప్రక్రియను ఈ బృందం అధ్యయనం చేయనుంది. ఆగ్రో ఎకాలజీ నమూనాలను ప్రత్యక్షంగా పరిశీలించనుంది. తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాల్లో క్షేత్ర సందర్శనలు చేయనుంది. ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నట్లు రైతు సాధికార సంస్థ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది.

## 8న జీఎస్టీ అవగాహన సదస్సు


జీఎస్టీ 2.0 కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్ తదితరులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0 అవగాహన సదస్సు ఈ నెల 8వ తేదీన నెల్లూరులో జరగనుంది. దీనికి హాజరుకావాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ సోమ సుందర ప్రసాద్ ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం ఎంపీ నివాసానికి వెళ్లి వేమిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా జీఎస్టీ 2.0పై ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. వేమిరెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గటంతోపాటు ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఎంపీ వేమిరెడ్డి

కలెక్టర్ హిమాన్షు శుక్లాను మంగళవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా అభివృద్ధిపై చర్చించారు. అనంతరం ఎస్పీ వేజెండ్ల అజితను మర్యాద పూర్వకంగా కలిసి జిల్లాలో సమస్యలను, చేపట్టాల్సిన అంశాలను, పెండింగ్ విషయాలు చర్చించారు. ఈ కార్యక్రమాల్లో నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాగా, సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం కలెక్టర్ హిమాన్షును మార్యాద పూర్వకంగా కలిశారు. మాదిగల సమస్యలను ఆయనకు తెలియ చేశారు.

### నందకిషోర్‌కు కలెక్టర్ అభినందనలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాలు, సనాతన సంస్కృతిపై పరిశోధనలు చేసి కాకతీయ కీర్తిపురస్కారం పొందిన నెల్లూరు నందకిషోర్‌రెడ్డిని కలెక్టర్ హిమాన్షు శుక్లా అభినందించారు. మంగళవారం సాయంత్రం నందకిషోర్‌రెడ్డి కలెక్టర్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఆయన కృషిని తెలుసుకుని సనాతన సంస్కృతిపై పరిశోధనలు కొనసాగించాలని కలెక్టర్ సూచించారు.

## ప్రతీ కుటుంబం ఓ మొక్క నాటాలి

● వేదగిరి క్షేత్రం మాజీ చైర్మన్ సురేంద్ర రెడ్డి


మొక్కలు నాటుతున్న వేదగిరి క్షేత్రం మాజీ చైర్మన్ సురేంద్రరెడ్డి

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతీ కుటుంబం ఒక మొక్కను విధిగా నాటి కాపాడుకోవాలని వేదగిరి క్షేత్రం మాజీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వేదగిరి క్షేత్రానికి చెందిన ఖాళీ స్థలాల్లో ఆలయ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. వర్షాకాలం మొదలైనందున ఇప్పుడే మొక్కలు నాటితే అవి పెరిగి పెద్దవై పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతాయని తెలిపారు.

## ఎన్‌సీసీ కేడెట్స్‌కు ఫైరింగ్‌లో శిక్షణ

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్‌కు రెయిన్‌బో సీబీఎస్‌ఈ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఫైరింగ్‌లో శిక్షణ ఇచ్చారు. శత్రువులను ఎలా ఎదుర్కొనాలన్న అంశంపై ఫైర్ టూ మూవ్ కార్యక్రమంలో కేడెట్స్ పాల్గొన్నారు. అనంతరం డ్రిల్, ఫిజికల్ ఎడ్యుకేషన్, మ్యాప్ రీడింగ్, ఎన్‌సీసీ తరగతులు నిర్వహించారు. వీటిని క్యాంప్ కమాండర్ కల్నల్ కరంచంద్ పర్యవేక్షించారు. సుబేదార్ హేమంత్ కుమార్, ట్రైనింగ్ ఆఫీసర్స్ సమాల్, రాజ్‌పాల్, ఎన్‌సీసీ అధికారులు మస్తాన్‌వలీ, శ్రీపతి ప్రసాద్, జయరాం, జావీద్, బాషా దీప్తి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న మధుసాయి, కమిటీ సభ్యులు

## నేటి నుంచి బాబా సమాధి ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్ అద్దాల సాయిబాబా మందిరంలో బుధవారం నుంచి విజయదశమి - బాబా సమాధి ఉత్సవాలు జరుగుతాయని మందిరం చైర్మన్ మధుసాయి తెలిపారు. ఈ ఉత్సవాల ఆహ్వాన పత్రికలను మంగళవారం మందిరంలో విడుదల చేశారు. బుధవారం ఉదయం 7గంటలకు భిక్షాటన కార్యక్రమం జరుగుతుందని భక్తులందరూ పాల్గొనాలని కోరారు. గురువారం ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు విజయదశమి, బాబాసమాధి వేడుకలు జరుగుతాయని తెలిపారు. 3వతేదీ సాయి సచ్చరిత పారాయణం జరుగుతాయని పేర్కొన్నారు.

### గాంధీ నగర్‌లో రేపటి నుంచి....

నగరంలోని గాంధీనగర్ (గాంధీబొమ్మ) షిరిడీ సాయి మందిరంలో గురువారం నుంచి బాబా సమాధి, విజయదశమి ఉత్సవాలు జరుగుతాయని మందిరం చైర్మన్ మన్నెం అమరనాథ్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సామూహిక పూజలు జరుగుతాయని తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.



## అమెరికాలో నెల్లూరు వారి బొమ్మల కొలువు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ రీత్యా అమెరికాలోని మిచిగాన్‌లో స్థిరపడిన నగరంలోని హరనాథపురానికి చెందిన నక్కా సాయి దివ్య బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. ఆమె పదేళ్లుగా ప్రతి సంవత్సరం దసరా సందర్భంగా బొమ్మల కొలువు పెడుతున్నారు. అక్కడి స్థానికులను ఆహ్వానించి బొమ్మల కొలువు విశేషాలను వివరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ కుమారి, ప్రసాద్, నేత్ర, ప్రియాంక, సుప్రజ, ప్రవీణ, వైష్ణవి, అనీష, రజనీ తదితరులు పాల్గొన్నారు.

## మనస్పర్ధలతో యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మనస్పర్ధల నేపథ్యంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు... నెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీలో షేక్ మున్నా(22), తస్లీమ్ దంపతులు నివసిస్తున్నారు. మున్నా వెల్డింగ్ పనులు చేసుకుంటూ భార్య, తల్లి దండ్రులను పోషిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను కొంత కాలంగా పనికి వెళ్లకుండా తిరగసాగాడు. దీంతో భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు చోటుచేసుకున్నాయి. పదిరోజుల కిందట భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో మున్నా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి చూడగా మున్నా మృతిచెంది ఉన్నాడు. తండ్రి చాన్‌బాషా ఫిర్యాదుతో నవాబుపేట పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

● నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

# రక్తదాత సుఖీభవ!

● ఎందరో ప్రాణాలు కాపాడుతున్న దాతలు ● కానీ, అవసరానికి తగ్గట్టు అందని రక్తం
● ఏడాదికి 40వేల యూనిట్లు అవసరం.. అందుతున్నది 30వేల యూనిట్లే!
● ఈ సంఖ్య పెరగాలంటున్న వైద్యులు ● యువతలో చైతన్యంతో మరింత ప్రయోజనం

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏ శస్త్రచికిత్స చేయాలన్నా రక్తం కీలకం. అవసరమైన రక్తం లభించగా ఒక్కోసారి ప్రాణాలు కూడా పోయిన సందర్భాలు ఉన్నాయి. జిల్లాలో జరుగుతున్న అనేక ప్రమాదాల్లో క్షతగాత్రులకు, శస్త్రచికిత్సలకు. రక్తహీనత ఉన్న గర్భవతులకు ఆసుపత్రులకు వచ్చిన వెంటనే రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో రక్తనిధి కేంద్రాలు అవసరమైన రక్తం అందించలేని పరిస్థితి నెలకొంది. దీనికి ప్రధాన కారణం రక్తదాతల కొరతే. జిల్లాలో 27 లక్షల మంది జనాభా ఉన్నా వీరిలో కేవలం 50 వేల మంది మాత్రమే రక్తదానం చేస్తున్నారు. ఏడాదికి 40 వేల యూనిట్ల రక్తం అవసరం కాగా ప్రస్తుతం 30 వేల యూనిట్లు మాత్రమే రోగుల అవసరాలు తీర్చుతున్నారు. ప్రతి 100 మందిలో 15 మంది రక్తదానం చేస్తేనే జిల్లాలో రక్తం అవసరాలు తీరుతుంది. అయితే ప్రస్తుతం కేవలం ఐదుగురు మాత్రమే రక్తదానం చేస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం 70 శాతం మంది రోగులకు ఇండియన్ రెడ్‌క్రాస్ మాత్రమే అవసరమైన రక్తాన్ని అందిస్తోంది. బాధితులకు అత్యవసరంగా రక్తం అందించేందుకు దాతల సహకారం ఎంతో అవసరం. దాతల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉంది.

**రెడ్‌క్రాస్ రక్తసేకరణ ఇలా**

| సంవత్సరం | రక్తం యూనిట్లు |
|---|---|
| 2021-22 | 22,893 |
| 2022-23 | 24,017 |
| 2023-24 | 15,555 |
| 2024-25 | 17,000 |
| 2025-26 (ఇప్పటి వరకు) | 12,450 |

● రెడ్‌క్రాసే దిక్కు

ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు రక్తం అందించటంలో రెడ్‌క్రాస్ రక్తనిధే దిక్కవుతుంది. ప్రధానంగా నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) వచ్చే రోగులకు రెడ్‌క్రాస్ అందించే రక్తం రోగుల పాలిట ప్రాణాధారం అవుతుంది. జీజీహెచ్‌లో రక్తనిధి ఉన్నా అది పూర్తిగా నిర్వీర్యం అయిందన్న విమర్శలు ఉన్నాయి. ఇద్దరు ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ చేసిన వైద్య నిపుణులు ఉన్నా శిబిరాలను నిర్వహించటంలో వైఫల్యం చెందుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. గతంలో డాక్టర్ కృష్ణమూర్తి రెడ్‌క్రాస్ ఇన్‌చార్జ్‌గా ఉన్నప్పుడు రెడ్‌క్రాస్‌కు పోటీగా రక్తదాన శిబిరాలను ప్రోత్సహించారు. తద్వారా పెద్ద ఎత్తున రక్తం సేకరణ జరిగేది. అయితే ప్రస్తుతం వ్యాధిగ్రస్తుల సహాయకులు ఇచ్చే రక్తదానంపైనే ఆధారప డుతుంది. ఈ నేపథ్యంలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు ఇచ్చే రక్తం పైనే ఇక్కడ వైద్యులు ఆధార పడుతున్నారు. ప్రస్తుతం రెండు ప్రత్యేక బస్సుల ద్వారా రక్తాన్ని సేకరించే సదుపాయం రెడ్‌క్రాస్‌కు ఉంది. నారాయణ, అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల బ్లడ్ బ్యాంక్‌లు కూడా ఏటా వేల యూనిట్ల రక్తాన్ని సేకరిస్తూ రక్తదాతలను ప్రోత్సహిస్తున్నాయి. కావలి, ఆత్మకూరు, ఉదయగిరి ఏరియా ఆసుపత్రుల్లోని బ్లడ్ బ్యాంక్‌లు రెడ్‌క్రాస్ సహకారంతో రక్తాన్ని సేకరిస్తున్నాయి. నగరంలో నోవా, నెల్లూరు, విజయ బ్లడ్‌బ్యాంకులు కూడా రక్తం సేకరిస్తున్నాయి.


రక్తదానం చేస్తున్న యువకులు

**కావాల్సి రక్తాన్ని సేకరిస్తున్నాము**

జిల్లాలో దాతల నుంచి రక్తాన్ని సేకరిస్తున్నాము. అయితే అవసరాలకు తగ్గట్టు సరిపోవడం లేదు. దాతల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం రెడ్‌క్రాస్ రక్తనిధిలో ఉన్న 140 మంది తలసేమియా వ్యాధిగ్రస్థులకు ఉచితంగా నెలకు 330 యూనిట్ల రక్తం అందిస్తున్నాం. సమాజంలోని ప్రతీ 100 మందిలో ఐదుగురు మాత్రమే రక్తదానం చేస్తుండగా ఆ సంఖ్య 15కు పెరగాలి.


- వాకాటి విజయకుమార్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్

**రక్తనిధి ద్వారా సేకరిస్తున్నాము**

జీజీహెచ్‌లోని రక్తనిధికి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు అన్నీ ప్రయత్నాలు చేస్తున్నాం. రక్తదాన శిబిరాలు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నాం. ప్రస్తుతం జీజీహెచ్ రక్తనిధిలో ఇద్దరు ట్రాన్స్‌ఫ్యూజ న్ మెడిసిన్ చేసిన వైద్యులు అందు బాటులో ఉన్నారు.


- డాక్టర్ కొండేటి మాధవి, జీజీహెచ్ సూపరింటెండెంట్

## చోళుల పాలనలో ఆలయాల అభివృద్ధి

● పురావస్తుశాఖ సంచాలకుడు మునిరత్నంరెడ్డి



రాపూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): 12వ శతాబ్దం నాటి చోళులు ప్రధానంగా ఆలయాల అభివృద్ధికి పాటుపడ్డారని భారతీయ పురావస్తుశాఖ సంచాలకులు కే.మునిరత్నంరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఇటీవల రాపూరు మండలం మునగాల వెంకటాపురం అటవీ ప్రాంతంలో లభ్యమైన పొత్తపు చోళుల కాలం నాటి శిలాశాసనంపై ఉన్న లిపి (అక్షరాలను) ద్వారా పొత్తపు చోళుల పరిపాలన, ఆలయాలకు భూదానం వంటివి జరిగాయని తెలిపారు. ఆ శిలాశాసనాన్ని బట్టి పొత్తపు చోళుల పాలన తమిళనాడును పరిపాలించే చోళరాజైన వీరరాజేంద్ర చోళులు (1178-1218) సామంతులుగా పొత్తపు చోళులు పరిపాలించే వారని వివరించారు. దొరికిన ఆధారాలను బట్టి అప్పట్లో రాజు సూరకుమారన్, ఆయన తండ్రి మధురాంతక పొత్తపిగా ఉండేవారని తెలిపారు. అప్పటికాలం ప్రకారం వలీశ్వరం డైయర్ దేవాలయం సన్నూర్ వద్ద ఉండేదని, ఈ ప్రాంతం సిరుకడైనాడు, సూరకుమారన్ రాజ్యంలో కలదని, ఈ రాజ్యాన్ని శకట్టి నాయకర్ పాలించే వారని వివరించారు. వీరి పాలనలోనే సుకుమారన్ నెల్లూరు ప్రాంత పరిధిలోనే రాజ్యాన్ని పాలిస్తున్నట్లు ఆధారాలున్నట్లు పేర్కొన్నారు. ఈ శిలా శాసనం మూడు పక్కలా రాసిన అక్షరాల ఆధారంగా ఈ వివరాలు తెలిసినట్లు ఆయన వివరించారు. ఆ రోజుల్లో భూదానాలు, దేవాలయాలకు అందేలా, అందులో జరిగే అనేక సేవల గురించి పొందుపరిచినట్లు తెలిపారు. ఆ రోజుల్లో శైవ, వైష్ణవ దేవాలయాలకు విరివిరిగా దానాలు చేయడంతోపాటు, వాటి అభివృద్ధికి తోడ్పడేవారని వివరించారు. మన పూర్వీకులు మనకు అందించిన వారసత్వ సంపదను కాపాడుకోవడంతోపాటు, దానిని భావితరాల కోసం భద్రపరచాలని మునిరత్నం రెడ్డి తెలిపారు.



## ఒక్కో ట్యాంకర్‌కు 80 కిలోల ఆయిల్ కోత

● పోర్టులో కంపెనీల మోసాన్ని అరికట్టండి : యోగానంద్

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నం పోర్టులో ఉన్న ఆయి ల్ కంపెనీల యాజమాన్యాలు ట్యాంకర్ల ఓనర్లను అన్యాయం చేస్తున్నాయని తిరుపతి జిల్లా శ్రీకాళ హస్తికి చెందిన సమాచార హక్కు చట్టం (ఆర్టీఏ) కార్యదర్శి యోగానంద్ ఆరోపించారు. మంగళవారం నగరంలోని జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతోమాఆట్లాడుతూ ఈ మధ్యకాలంలో ప్రతిరోజు టాంకర్ల లోడింగ్‌లో 80 నుంచి 120 కిలోల వరకు ఆయిల్ తక్కువగా వస్తోందని పేర్కొన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే మీ బ్రోకర్ల ద్వారా మెయిల్ పెట్టండి. చూస్తామంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. బ్రోకర్లు పలుమార్లు మెయిల్ పెట్టినా వారు పట్టించుకోవడం లేదని చెప్పారు. ఒక లారీకి 100 కేజీలు అంటే రూ.13వేలు ఆయిల్ తక్కువ రావడంతో ట్యాంకర్ల ఓనర్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తూనికల కొలతలు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కస్టమ్స్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంలకు ఆధారాలతో లేఖ రాయడం జరిగిందన్నారు. పది రోజులకు ఒకసారి అయినా జిల్లా ఉన్నతాధికారులు కంపెనీలలోకి వెళ్లి పర్యవేక్షించాలని కోరారు.

## 4న నెల్లూరులో బీసీల రౌండ్ టేబుల్ సమావేశం

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఈ నెల 4వ తేదీన బీసీల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా నేటికీ బీసీలు ఆర్థికంగా సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. జనాభా ప్రాతిపదికన వీరికి చట్టసభల్లో సీట్లు కేటాయించాలని ప్రభుత్వాలను కోరారు. దేశంలో 4300కుపైగా వెనుకబడిన కులాలు ఉన్నాయని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశానికి అందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కొత్త మినగల్లు ఘటనపై హోంమంత్రి సీరియస్

● కోవూరు ఎమ్మెల్యేతో మాట్లాడిన అనిత

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్త మినగల్లులో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి ఘటనపై రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సీరియస్ అయ్యారు. జరిగిన ఘటనపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో ఆమె చర్చించి, వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించినట్టు సమాచారం. మరోవైపు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్‌తో పాటు బాధిత కుటుంబాల సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, జగదీష్, హరికృష్ణ తదితరులు శ్రీకాంత్‌ను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైసీపీ దుశ్చర్యలను తీవ్రంగా ఖండించారు.


శ్రీకాంత్‌ను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

● పోలీసుల అదుపులో నలుగురు

టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన నిందితుల్లో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. మిగతా వారి కోసం గాలిస్తున్నట్టు సమాచారం.

# చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

## విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్ధల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

## కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

## శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

## ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

## సవాళ్లకు సిద్ధమే

సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.



## రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

## జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.



## రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

ఉదయగిరి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లిలో నిర్మించిన శ్రీగంగాదేవి, పోతురాజు విగ్రహ, కలశాల ప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

**బంగారం, వెండి ధరలు**

| | |
|---|---|
| బంగారం (22 క్యారెట్లు) | |
| ఒక గ్రాము ధర | రూ. 11057 |
| వెండి కిలో ధర | రూ. 147700 |
| వెండి ఒక గ్రాము | రూ. 151.70 |

# సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారం


అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం లభించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన ఆత్మకూరు ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో అన్ని శాఖల ఉన్నతాధికారులతో నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తనకు ప్రథమ కర్తవ్యమన్నారు. త్వరలో ఆత్మకూరు నుంచి మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులను పిలిపించి ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ, ఆయా పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలు పంపిణీ చేశారు. తరువాత మండలాల వారీగా వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కాగా బుధవారం జరిగే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో కూటమి నాయకులు సచివాలయ సిబ్బందితో కలసి పాల్గొనాలని మంత్రి ఆనం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, ఆర్డీవో పావని, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపును ప్రజల్లోకి తీసుకెళ్లండి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీని కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచించారు. వింజమూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని 122 మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం డీఎస్సీ ద్వారా నియోజకవర్గంలో 199 మందికి టీచర్ పోస్టులు ఇచ్చిందని ఆయన తెలిపారు.బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యర్తలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొట్టే వెంకటేశ్వర్లు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి రంగారావు, టీడీపీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్ర మధుసూదన్ జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న చంద్ర మధుసూదనరావు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏఎంసీ మాజీ ఛైర్మన్, టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పామూరులోని స్వగృహంలో ఆయన్ను కలిసిన నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం శాలువాలు, పూలమాలలతో సన్మానించడంతోపాటు కేక్ కట్ చేసి,ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, పీఏసీఎస్ ఛైర్మన్ గుర్రం గోపి, టీడీపీ నేతలు శ్రీకాంత్‌యాదవ్, ముజ్జి లక్ష్మీనారాయణ, వైఎస్ ఎంపీపీ డీ మధు, మానం కొండలరావు, పొద మాధవరావు, తెల్లగొర్ల వెంకటయ్య, ఆరికొండ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ బుక్‌తో భరోసా


డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

ఉదయగిరి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు అండగా ఉండేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారని మండల వైసీపీ కన్వీనర్ కొండా రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో డి జిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కల్లూరి రమణారెడ్డి, దస్తగిరి అహ్మద్, షంషీర్, సయ్యద్ గౌస్ మొహిద్దీన్, నారపరెడ్డి, ఎంఏ సలీం, డీ. సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా లలితారుద్ర మహాయజ్ఞం

సంగం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమన కొండలోని శ్రీరాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం చేపట్టిన 45 రోజుల లలితారుద్ర మహాయజ్ఞం మంగళవారం నాటికి ఎనిమిదవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జ్ఞానపీఠంలో లలితా సహస్రనామాలతో దశ మహావిద్యా, దేవత మూలమంత్రాలతో, సకల ద్రవ్యాలతో యజ్ఞం నిర్వహించారు.

## వృత్తి విద్యతోనే భవిష్యత్‌కు బంగారు బాటలు

ఆత్మకూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సుల వల్లనే భవిష్యత్‌కి బంగారు బాటలు వేసుకోవచ్చని ఒకేషనల్ జిల్లా కో ఆర్డినేటర్ మల్లికార్జున పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దసరా సెలవుల సందర్భంగా సమగ్ర శిక్ష స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఇంటర్ షిప్ తరగతులను పరిశీలించారు. విద్యార్థులు నేర్చుకున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్యా ట్రైనర్ జీ. ఎజ్రా, నాగం వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యూరియా పంపిణీ

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్మవారిపాళెం సొసైటీ కార్యాలయ గోదాములో మంగళవారం సొసైటీ ఛైర్మన్ పేలపూడి వెంకటరత్నం, మండల వ్యవసాయాధికారి మదన్‌మోహన్ రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో లోకనాథ్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ చుండి హరిగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు కాకర్ల మధుసూదన్‌రెడ్డి, చల్లా ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు


కావలి రూరల్: దుర్గాదేవి అలంకరణలో కనకదుర్గ


ఉదయగిరి శివాలయంలో దుర్గాదేవిగా పార్వతీదేవి


కొండాపురం: దుర్గాదేవిగా దర్శనమిచ్చిన గంగమ్మ

ఉదయగిరి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజైన మంగళవారం పట్టణంలోని పార్వతీపరమేశ్వరి, బాలాజీనగర్ సంతానలక్ష్మి, గండిపాళెం నాగారప్పమ్మ ఆలయాల్లో అమ్మవారు భక్తులకు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**సంగం** : స్థానిక సంగమేశ్వరాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు మంగళవారం రాత్రి దుర్గాష్టమిని పురస్కరించుకుని కామాక్షిదేవి దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి పల్లకిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాలం పద్మనాభరెడ్డి జ్ఞాపకార్థం జ్యోతమ్మ ఉభయకర్తగా వ్యవహరించారు.

**వరికుంటపాడు(ఉదయగిరి రూరల్)** : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని తూర్పురొంపిదొడ్ల, వరికుంటపాడు గ్రామాల్లో వెలసి ఉన్న మానసాదేవి, నాగారప్పమ్మ అమ్మవార్లు మహాగౌరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన, సహస్రదీపాలంకరణ, అర్చనలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

**కావలిరూరల్** : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వివిధ ఆలయాల్లో అమ్మణ్ణులకు దుర్గాదేవి అలంకరణ కనులపండువగా జరిగింది. కావలి గ్రామ దేవత కలుగోళశాంభవి దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పులి వాహనసేవ నిర్వహించారు. విష్ణు ఆలయంలోని రాజ్యలక్ష్మికి వీరలక్ష్మి అలంకరణలో విశేష పూజలు నిర్వహించారు. శివాలయంలోని దుర్గాభ్రమరాంబ, కొత్తబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి, వడ్డిపాలెంలోని కనకదుర్గ అమ్మవార్లు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**కొండాపురం** : మండలంలోని సాయిపేట పంచాయతీ మక్కెనవారిపాలెంలో దుర్గాష్టమిని ఘనంగా జరుపుకున్నారు. గంగమ్మ భక్తులకు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. టెలికాంబోర్డు అడ్వైజరీ మెంబరు తాటికొండ అనూష ఆధ్వర్యంలో గాజుల మాలతో ప్రత్యేక అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**కలిగిరి** : మండలంలోని తెల్లపాడులో భద్రకాళి భక్తులకు దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి పంచామృత స్నపన అభిషేకములతోపాటు ఆలయ ప్రాంగణంలో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త జూపల్లి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

**బిట్రగుంట** : బోగోలు మండలంలోని పలు ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. విశ్వనాథరావుపేట కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. రామస్వామిపాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, బోగోలు షిరిడీ సాయిబాబా మందిరం, బిట్రగుంట శేషసాయి మందిరాల్లో అమ్మవారులు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.


కలిగిరి : దుర్గాదేవి అలంకారంలో భద్రకాళి


కావలి రూరల్ : పులివాహనంపై ఊరేగుతున్న కలుగోళ్ల శాంభవి


బిట్రగుంట : దుర్గాదేవిగా రాజరాజేశ్వరిదేవి

# శివాయి భూముల ఆక్రమణలపై సర్వే

**● డీఆర్ కాలువకు అవసరమైతే పట్టాభూమైనా ఇస్తాం ● మాలేపాటి సోదరుల స్పష్టం**

దగదర్తి(బిట్రగుంట), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తమ భూముల్లో శివాయి భూములు కలిసి ఉంటే స్వచ్ఛందంగా వదిలేస్తామని, డీఆర్ కాలువకు భూములు అవసరమని అధికారులు కోరితే తమ సొంత పట్టా భూములు ఇవ్వడానికైనా సిద్ధంగా ఉన్నామని మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు, నీటి సంఘం అధ్యక్షుడు మాలేపాటి సుధాకర్‌నాయుడు స్పష్టం చేశారు. దగదర్తి మండలం దగదర్తి-రాచర్లపాడు కాలువ ఆధునీకరణ పనుల్లో అవకతవకలు, ఆక్రమణలపై ఇరిగేషన్ ఏఈ విజయకుమార్ మంగళవారం పరిశీలించారు. పైడేరు వాగుపై వంతెన నిర్మాణం, శివాయి భూముల ఆక్రమణపై సచివాలయ సర్వేరుతో కొలతలు వేయించారు. ఈ సందర్భంగా డీఆర్ చానల్ వద్దకు చేరుకున్న మాలేపాటి సోదరులు మాట్లాడుతూ కాలువ పక్కన ఉన్న పట్టా భూములు కొనుగోలు చేశామని, అందులో శివాయి భూమి ఉంటే ఇచ్చేందుకు వెనుకాడమన్నారు. కావలుకు సంబంధించిన శివాయి భూమి ఇరువైపుల సమానంగా కొలుచుకుని రైతులకు మేలు కలిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.శివాయి భూముల ఆక్రమణలపై సర్వే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కావలి రూరల్ సీఐ పాపారావు, స్థానిక ఎస్ఐ జంపానికుమార్, సిబ్బందితో భద్రత చర్యలు చేపట్టారు. అయితే ఆక్రమణల నిర్ధారణ నిర్ణయాన్ని మాలేపాటి సోదరులు అధికారులకు వదిలి వేయడంతో సర్వే పనులు సాఫీగా సాగాయి.


ఇరిగేషన్ ఏఈతో మాట్లాడుతున్న మాలేపాటి సోదరులు

**అభివృద్ధి పనులు ఆటంకం కలిగించొద్దు : పమిడి**

కూటమి ప్రభుత్వ పాలనలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి చొరవ తీసుకుని గతంలో నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నారని, ఈ పనులకు ఆటంకాలు కలిగించడం మంచిది కాదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి పేర్కొన్నారు. మంగళవారం ఆయన దగదర్తిలో ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ డీఆర్ కాలువకు పక్కన ఉన్న శివాయి భూముల ఆక్రమణల విషయమై అధికారులు సర్వే చేపట్టారన్నారు. అంతే కాకుండా కాలువ నిర్మాణ పనులో అవినీతి, నాసిరకంగా పనులు జరుగుతున్నాయని కొందరు పని కట్టుకుని చెప్పడం మానుకోవాలన్నారు.

## పొగనారులో తెగుళ్లపై జాగ్రత్తలు తీసుకోవాలి

కలిగిరి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పొగాకు నారుమళ్లు సాగు చేస్తున్న రైతులు తెగుళ్ల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వేలం నిర్వహణాధికారి వీ.శివకుమార్ తెలిపారు. మంగళవారం వేలం కేంద్రం పరిధిలోని దుత్తలూరు కమ్మవారిపాలెం, లక్ష్మీపురం, రాచవారిపల్లి, బ్రహ్మేశ్వరం గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న నారుమళ్లను ఆయన పరిశీలించారు. అధిక వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలతో వాతావరణంలో మార్పులు ఉండటం వలన పొగనారుకు మాగుడు తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. బోర్డు అధికారులు సూచించే సలహాలను పాటించి ఆరోగ్యవంతమైన పొగనారును ఉత్పత్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌ఆఫీసర్ సంతోష్‌కుమార్, క్షేత్ర సహాయకులు హజరత్ బాబు, వెంకటేష్, రోహిత్, రైతులు పాల్గొన్నారు.

## రక్తదానంపై అవగాహన కలిగి ఉండాలి

కావలి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కావలి ఏరియా వైద్యశాల ఆర్ఎంవో ప్రమీల, డాక్టర్లు హరిత, హాలీ మౌలాలీలు తెలిపారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏరియా వైద్యశాల డాక్టర్లు, నర్సులు, సిబ్బంది రక్తదానం ఆవశ్యకత తెలియచేస్తూ వైద్యశాల నుంచి ట్రంకు రోడ్డులోని సెల్ఫీ పాయింట్ వరకు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ యువత, ప్రజలు అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలన్నారు. ఈ రక్తంను ఏరియా వైద్యశాలలో అత్యవసరమైన వారికి ఉచితంగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పొబ్బా సాయివిఠల్, వీసేవ ఫౌండేషన్ బ్లడ్ మోటివేటర్ వినయ్‌కుమార్, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో 'స్వచ్ఛత హీ సేవ'

కావలి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఒకటో పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నేతలు చీపుర్లు పట్టి బస్టాండ్ ఆవరణంను శుభ్రపరిచారు. డిపో మేనేజరుకు ఇక్కడ పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు పరుసు వెంకటేశ్వర్లు, వింతా రంగారెడ్డి, కే. బ్రహ్మానందం, పూనూరు మాధవి, బెల్లంకొండ మాల్యాద్రి, పరుసు మధు, పాతపాటి వెంకటరమణారెడ్డి, మామిడి వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, సుజి పాల్గొన్నారు.

## ఈ-క్రాప్ నమోదు గడువు పెంపు

ఉదయగిరి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ నమోదుకు అక్టోబరు 15 వరకు గడువు పొడిగించినట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు పీ.చెన్నారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ-క్రాప్ నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని ఆయన కోరారు.




**C.R.I.M.E N.E.W.S**

# చెముడుగుంటలో దారుణ హత్య

**● బంగారం కోసమేనన్న అనుమానాలు**

**● మృతదేహాన్ని పరిశీలించిన రూరల్ డీఎస్పీ**


అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మల్లికార్జున్


ఘటనాస్థలంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు సుబ్బారావు, శ్రీనివాసరావు

వెంకటాచలం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడుగుంట పంచాయతీ పరిధిలోని జాతీ య రహదారికి కూతవేటు దూరంలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మంగళవారం సాయంత్రం స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల కథనం మేరకు, బుజబుజనెల్లూరులోని న్యూ కాలనీలో వల్లూరు మల్లికార్జున్ కుటుంబం నివాసం ఉంటోంది. కొంతకాలం నుంచి అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న మల్లికార్జున్ ఇటీవల కొంతవరకు కోలుకున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయిన మల్లికార్జున్(55) జిల్లా జైలుకెళ్లే మార్గంలో శవమై తేలాడు.

**● మృతిపై అనుమానాలు**

కాగా మల్లికార్జున్ ఎవరితో గొడవపడే వ్యక్తికాదని, చాలా మంచోడని, అలాంటి వ్యక్తి ఇలా అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. మృతుడు ఎప్పుడూ చేతికి ఉంగరాలు, మెడలో బంగారు చైను ధరించి ఉంటాడని, కానీ అవి కనిపించకుండా పోవడంతో ఎవరైనా బంగారం కోసం హత్య చేసి ఉంటారన్న అనుమానం స్థానికుల్లో కలుగుతోంది. మృతుడి మెడ చుట్టూ టెంకాయ నారతాడు చుట్టి ఉండటం, ముఖంపై గాయాలతోపాటు తీవ్రస్థాయిలో దెబ్బలు తగిలి ఉండటం, తల పక్కనే బండరాయి కనిపించడంతో ఎవరో కిరాతకంగా హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**● ఫొటోలు తీయకూడదు..**

విషయం తెలుసుకున్న రూరల్ డీఎస్పీ జీ. శ్రీనివాసరావు, వెంకటాచలం, వేదాయపాళెం సీఐలు పీ సుబ్బారావు, శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీం నిపుణులను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించి చుట్టుపక్కల గాలించారు. కానీ మీడియాని రానివ్వకుండా అత్యంత గోప్యంగా కేసు దర్యాప్తు చేపట్టారు. ఇలాంటి ప్రాంతాలకు మీడియా రాకూడదని, తమ అనుమతి లేకుండా ఫొటోలు కూడా తీయరాదంటూ చెబుతూ మీడియాకి పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఎక్కడా లేని విధంగా కొత్త నిబంధనలు పెట్టిన పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**● ఎస్పీ అజిత పరిశీలన**

జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల మంగళవారం రాత్రి సంఘటనా స్థలాన్ని పరిశీలించి హత్యకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు.

## సోదరిపై అన్న కుటుంబ సభ్యుల దాడి

కావలిరూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కావలి మండలం అన్నగారిపాలెంకు చెందిన జెడ్డా చిన్నమ్మపై ఆమె అన్న గోళ్ల పొట్టియ్య, అతని భార్య తిరుపతమ్మ, కుమారుడు నవీన్‌లు మంగళవారం దాడి చేసి గాయపరిచారు. పోలీసుల కథనం మేరకు.. అన్న పొట్టియ్య కుమారుడు నవీన్‌కు వస్తున్న పెళ్లి సంబంధాలను చెల్లెలు చిన్నమ్మ చెడకొడతుందనే అనుమానంతో కుటుంబ సభ్యులు ఆమెపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు రూరల్ పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గేదె చోరీపై కేసు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఖాళీ స్థలంలో కట్టేసిన గేదెను ఇద్దరు దుండగులు దొంగలించుకు వెళ్లిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూరులోని పడారుపల్లి చలపతినగర్‌లో ఎం ప్రభాకర్ గేదెలను పెంచుతూ పాల వ్యాపారం చేసుకుంటున్నారు. ప్రతీ రోజు గేదెలను తన ఇంటిముందున్న ఖాళీస్థలంలో కట్టేసేవారు. ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు గుర్తుతెలియని దుండగులు గేదెను అపహరించుకుని వెళుతుండటాన్ని గూర్ఖా చూసి బాధితునికి తెలియజేశారు. ప్రభాకర్ సీసీ కెమెరాలను పరిశీలించగా నిందితులు సుందరయ్యకాలనీకి చెందిన ముంజునాథ్, వెంకటేష్‌గా గుర్తించారు. వారి కోసం గాలించినా జాడ తెలియకపోవడంతో మంగళవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 9 సవర్ల బంగారం, 250 గ్రాముల వెండి అపహరణ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ఎఫ్‌సీఐ కాలనీ సమీపంలోని కృష్ణానగర్‌లో వెంకట వరప్రసాద్ కుటుంబం నివసిస్తోంది. ఆయన వేదాయపాలెం నారాయణ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 27వ తేదీన ఆయన కుటుంబంతో హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఆయన ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలోని సుమారు తొమ్మిది సవర్ల బంగారు ఆభరణాలు, పూజగదిలోని 250 గ్రాముల వెంటి వస్తువులు అపహరించుకుని వెళ్లారు. మంగళవారం ఇంటికి వచ్చిన బాధితులు చోరీ జరిగినట్లు గుర్తించి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహిత మెడలోని గొలుసు చోరీ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుడి నుంచి భర్త, కుమార్తెతో కలిసి బైక్‌పై వెళుతున్న వివాహిత మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు తెంపుకెళ్లిన ఘటన రాంజీనగర్‌లో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన లక్ష్మి, అశోక్‌రెడ్డి దంపతులు సోమవారం రాత్రి కుమార్తెను తీసుకుని రాజరాజేశ్వరి గుడికి వెళ్లారు. అమ్మవారిని దర్శించుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరారు. రాంజీనగర్ వద్దకు వచ్చేసరికి వర్షం వస్తుండటంతో ఓ దుకాణం వద్ద ఆగారు. వర్షం తగ్గిన వెంటనే బయలుదేరారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు బైక్‌ను వెంబడించి లక్ష్మి మెడలోని 4 సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. ఊహించని ఈ పరిణామంతో ఖంగుతిన్న బాధితులు తేరుకుని దుండగులను వెంబడించే ప్రయత్నం చేశారు. అప్పటికే వారు పరారయ్యారు. బాధితులు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళ అదృశ్యం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాంట్రాక్టు ఉద్యోగిని అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూరు నగరానికి చెందిన ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. ఈ నెల 25వ తేదీ విధులకు వెళ్లిన ఆమె అక్కడ నుంచి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు గాలించినా ప్రయోజనం లేకపోవడం, ఆమె ఫోన్‌సైతం స్విచ్ ఆఫ్ ఉండటంతో సోమవారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 125 |
| స్కిన్ చికెన్ | 228 |
| స్కిన్‌లెస్ | 250 |
| కోడిగుడ్ల ధర (100): 530 | |

## పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

ఉలవపాడు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాల సుబ్రహ్మణ్యం మంగళవారం ఉలవపాడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మండలంలోని యువతను చెడు వ్యవసనాల వైపునకు మళ్లించే అసాం ఘీక కార్యక్రమాలపై దృష్టి సారించాలని, గ్రామాల్లో పేకాట నిర్వహణకు తావివ్వకుండా అరికట్టాలని ఎస్‌ఐ అంకమ్మకు సూచించారు. పరిసర ప్రాంతాలను పరిశీలించిన ఆయన పోలీస్ స్టేషన్ చుట్టూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. డీఎస్పీ వెంట కందుకూరు సీఐ అన్వర్‌బాషా ఉన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

# ఆక్రమణల చెరలో చెరువులు!

- యథేచ్ఛగా పంటలు, తోటల సాగు
- సాగునీటికి ఆయకట్టు రైతుల అవస్థ

లింగసముద్రం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సాగు నీటి చెరువులు ఆక్రమణల చెరలో చిక్కుకున్నాయి. ఆక్రమిత భూముల్లో ఆక్రమణదారులు ప్రతీ ఏటా యథేచ్ఛగా పంటలు సాగు చేసి లక్షలాది రూపాయలు అర్జిస్తున్నారు. కొందరైతే ఏకంగా శాశ్వత ప్రాతిపదికన మామిడి తోటలు వేశారు. దీంతో సాగునీటి చెరువుల విస్తీర్ణం కుంచించుకుపోతోంది. దీంతో చెరువులకు చేరుతున్న నీరు పంటల సాగుకు సరిపోక ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలో లింగసముద్రం కొత్త చెరవు కింద 117 ఎకరాలు, పాత చెరువు పరిధిలో 714, విశ్వనాథపురం 158, వీఆర్ కోట 290, చిన పవని 612, పెదపవని 415, మేదరమెట్లపాలెం చెరువు 120 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువులలో జోరుగా ఆక్రమణలు జరుగుతున్నాయి. ముఖ్యంగా 2016లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సాగు నీటి చెరువులలో ఆక్రమణలను తొలగించాలని ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో అప్పట్లో మైనర్ ఇరిగేషన్ అధికారులు సాగు నీటి చెరువుల హద్దులను తేల్చి, ఆక్రమణలను తొలగించేందుకు సన్నద్ధం అయ్యారు. అయితే అప్పట్లో పెదపవని చెరువును సగ భాగం సర్వే చేయగా, మొగిలిచెర్ల చెరువును ఆక్రమణదారులు పూర్తిగా సర్వే చేయనివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో లింగసముద్రం కొత్త, పాత చెరువులను కూడా సర్వే చేసేందుకు రెవెన్యూ, సర్వే అధికారులు సహకరించలేదని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. వీఆర్ కోట, చినపవని, మేదరమెట్లపాలెం చెరువులను పూర్తిగా సర్వే చేసి ట్రెంచ్ కూడా వేశారు. అయితే మిగిలిన చెరువులను సర్వే చేయకపోవడంతో ట్రెంచ్ ఏర్పాటు చేయలేదు. ఆక్రమణదారులు చెరువుల లోపల ఉన్న భూములతో పాటు చెరువుల చుట్టూ లోపలి హద్దులను కూడా ఆక్రమించుకొని పైర్లు సాగు చేస్తున్నారు. అంతేగాకుండా చెరువులకు ఎగువ నుంచి నీరందించే వరవ కాలువలను కూడా ఆక్రమించుకొని పైర్లు సాగు చేస్తున్నారు. ఇదిలావుండగా మండలంలోని 8 సాగు నీటి చెరువులలో ఆక్రమణదారులు జామాయిల్, మామిడి, నిమ్మ, వరి, మెట్ట పైరు సాగు చేయడంతో పాటు కొందరు పక్కా గృహాలు కూడా నిర్మించుకొన్నారు. ఆక్రమణదారులకు పుష్కలంగా రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారన్న చర్చ జరుగుతోంది. దీంతో సాగు నీటి చెరువులలో నీటి నిల్వ పరిమాణం తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా పెరుగుతున్న ఆక్రమణలను అడ్డుకుని ఉన్న ఆక్రమణలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.


పెదపవని చెరువు భూమిని ఆక్రమించి సాగు చేసిన మామిడి తోట

# సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి : ఇంటూరి

కందుకూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యసిబ్బంది కీలకపాత్ర పోషించాలని, సీజనల్ వ్యాధుల పట్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా చేపట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కందుకూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జరిగిన ప్రత్యేక వైద్య శిబిరంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళల్లో రక్తహీనత అధికంగా కనిపిస్తోందని, దీని నివారణకు ఆరోగ్యసిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధి కూడా మహమ్మారిలా వ్యాపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్‌ను సందర్శించి డాక్టరు శేషారెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. మూమెంట్ రిజిష్టర్‌ను పరిశీలించారు.

**● ఆసుపత్రి అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు**

ఉలవపాడు మండలం రామాయపట్నం పోర్టు పరిధిలో రాబోతున్న భారీ పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులు కేటాయించి కందుకూరు ఏరియా ఆసుపత్రిని కార్పొరేట్‌స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సక్షమ్ సంస్థ ఆధ్వర్యంలో 10 మందికి అలింకో కంపెనీకి చెందిన వినికిడి యంత్రాలను అందజేశారు. ఎమ్మెల్యేని డాక్టర్లు, సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టరు శకుంతల, పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, గడ్డం మాలకొండయ్య, శిగా తిరుపాలు, మువ్వల భూషయ్య, మన్నేపల్లి వరప్రసాద్ పాల్గొన్నారు.


చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**● చిన్నారులకు అభినందన**

కందుకూరు పట్టణానికి చెందిన చిన్నారులు తమ నాట్యప్రతిభతో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై అద్భుతాలు సృష్టిస్తూ నోబెల్ వర ల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించటం పట్ల ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వారిని ప్రత్యేకంగా అభినందించారు. నటరాజ నాట్యమండలి-సరస్వతీ నిలయం ద్వారా తిరుమలశెట్టి వెంకటదత్తేశ్వరి శిక్షణలో మూడేళ్లుగా పలు అంతర్జాతీయ, జాతీయ వేదికలపై దత్తేశ్వరితో పాటు చిత్రవు కార్తీకవల్లి, నాగకృతికవల్లి, నాగసూరి శ్రీహన్సికలు పలు ప్రదర్శనలిచ్చి నోబెల్ వరల్డ్‌రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. వారికి సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలు అందజేసి ఎమ్మెల్యే అభినందిం చారు. అలాగే ఆర్.లతికా, సీహెచ్ మన్విత, జి.సహాస్, కె.గీతాసహస్ర, ఎన్‌హన్సిక, సీహెచ్ కార్తీక, సీహెచ్ కృతిక, పీవీ సిరి, ఎం. యశశ్విని, జీ. సాన్వి, బీ. వాసవి, కె.ప్రవిష్ణు, ఎస్, ఈషా, మాన్వి, ఈ. మన్విత తదితర చిన్నారులు జాతీయ పురస్కారాలు అందుకోగా వారినీ ఎమ్మెల్యే అభినందించారు.

# దత్తాత్రేయ స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

లింగసముద్రం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో దుర్గాష్టమి పండుగను ఘనంగా జరుపుకున్నారు. మొగిలిచెర్లలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆలయంలో గురువారం విజయదశమి రోజు భవానీ కంకణ దీక్ష భక్తులచే పండరి భజన, అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం జరుగుతుందన్నారు. అదేరోజు రాత్రి భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.


దుర్గాదేవి అలంకరణలో రాజరాజేశ్వరి

# నేటి నుంచి వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

లింగసముద్రం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపవనిలో వెలసియున్న పావనక్షేత్ర వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుంచి 3వ తేదీ వరకు 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు స్వామి వారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు. 2న ఉదయం 10 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని తెలిపారు.

బ్రహ్మోత్సవాలలో నేడు

ఉదయం: 7 గంటలకు మహారథోత్సవం | రాత్రి: 7-9మధ్య అశ్వవాహనం







అలంకారప్రియుడు.. పూలరంగడు.. తిరుమలేశుడు. సకల జగత్తుకూ జీవదాతలైన సూర్య చంద్రులనే తన వాహనాలుగా మలచుకున్న మాయగాడు. మంగళవారం ఉదయం సూర్యప్రభమీద ఊరేగిన స్వామి, రాత్రి చంద్రప్రభపై విహరించాడు. మెడలో నూరువరహాల ఎర్రెర్రని పూదండతో పగలు సోయగాలు చిందించిన శ్రీనివాసుడు, రాత్రి మల్లెపూమాల ధరించాడు.

# సూర్య చంద్రులే వాహనాలుగా...

## నూరువరహాల సోయగం

బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే వాహన సేవల్లో సూర్యప్రభవాహనం ఒకటి. అత్యంత బరువుతో కూడిన ఈ వాహనంపై కొలువుదీర్చే మలయప్పస్వామికి విశేష పుష్పాలంకరణ చేస్తారు. సూర్యుడికి ప్రతీకగా ఎర్రటి నూరువరహాల పూలను వినియోగిస్తారు. 40 కిలోలపూలతో అల్లిన మాలను మలయప్పస్వామికి అలంకరించారు. కిలో రూ.10 వేల ధర కలిగిన కురువేరును నూరువరహాల పూలమాల కిందనే వినియోగించారు. సంపంగి, కనకంబరం పూల మాలలను కూడా స్వామికి అలంకరించడంతో సూర్యప్రభ వాహనంపై మలయప్పస్వామి ప్రత్యేక అందాలతో భక్తుల హృదయాలను దోచుకున్నారు.

## మల్లెపూల పరిమళం


రాత్రి చంద్రప్రభ వాహనంపై 60 కిలోల మల్లెపూల మాల ధరించిన మలయప్ప మాడవీధుల్లో భక్తులకు కనువిందు చేశాడు. వెన్నెరేడు చందురుడు. ఆయనకు ప్రతీకగా తెల్లని పూలను రాత్రి అలంకరణలో వాడారు. మల్లె పూలకు ఇది కాలం కాకపోయినా టీటీడీ ఉద్యానవన విభాగం మూడు బృందాల ద్వారా వీటిని సేకరించింది. పుత్తూరు పరిసర ప్రాంతాలు, మధురై వంటి ప్రాంతాల నుంచి కిలో దాదాపు రూ.800 పెట్టి వీటిని తీసుకువచ్చారు. అల్లిన మల్లె మాలలో స్వామి అందం ఇనుమడించింది. ఈ వాహనసేవలోనూ ఐదు కిలోల కురువేరును వినియోగించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వాహన సేవల్లో ప్రదర్శనలు ఇవ్వడానికి 28 రాష్ట్రాల నుంచి 6,960 మంది కళాకారులు వచ్చారు. మంగళవారం రాత్రి చంద్రప్రభ వాహన సేవ వరకు దాదాపు 6,400 మంది కళాకారులు తమ అద్భుత విన్యాసాలతో భక్తులను అలరించారు.

24వ తేది రాత్రి పెద్ద శేషుడితో స్వామివారి వాహన సేవలు మొదలయ్యాయి. బుధవారం రాత్రి జరగనున్న అశ్వ వాహనంతో ముగియనున్నాయి.







## ఏపీ కనీస వేతనాల సలహా మండలి సభ్యుడిగా జయరామిరెడ్డి

కేవీబీపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం టీడీపీ నేత కరణి జయరామిరెడ్డిని ఏపీ కనీస వేతనాల సలహామండలి సభ్యుడిగా ఎంపిక చేశారు. ఈ మేరకు మంగళవారం టీడీపీ అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సీఎం చంద్రబాబునాయుడు తనపై నమ్మకంతో పదవి అప్పజెప్పినందుకు రుణపడి ఉంటానని జయరామిరెడ్డి తెలిపారు.

## బెస్త కార్పొరేషన్ డైరెక్టర్లుగా పళణి, శ్రీధర్



బొమ్మన పళణి - కోడిపర్తి శ్రీధర్

తడ/గూడూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బెస్త సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌కు 15 మంది డైరెక్టర్లను నియమించారు. వీరిలో జిల్లాకు సంబంధించి తడ మండలానికి చెందిన బొమ్మన పళణి, గూడూరుకు చెందిన కోడిపర్తి శ్రీధర్ ఉన్నారు. బెస్త కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బొమ్మన శ్రీధర్‌కు బొమ్మన పళణి స్వయాన చిన్నాన్న. బెస్త కార్పొరేషన్‌లో తడ మండలానికి చెందిన ఇద్దరికి పదవులు దక్కడంతో మత్స్యకారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పళణిని పులికాట్ మత్స్యకార సంక్షేమ సంఘం నాయకులు అభినందించారు. మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేస్తానని శ్రీధర్ చెప్పారు.

## స్విమ్స్ ఓపీ, ఓటీలకు రేపు సెలవు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు, 30(ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా గురువారం స్విమ్స్‌లో ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం అత్యవసర సేవలు మాత్రమే యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు. రోగులు, ప్రజలు సహకరించాలని కోరారు.

## జీవిత ఖైదీకి బంగారు పతకం

ఏర్పేడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైల్లో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న జి.యుగంధర్ మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ నుంచి బంగారు పతకం అందుకున్నాడు. ఏర్పేడు మండలం జంగాలపల్లెకు చెందిన ఇతడికి.. ఒక హత్య కేసులో 2011 జూలై 18న జీవితఖైదు పడింది. కడప కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ కారాగారంలోకి వచ్చినప్పటి నుంచి ఓల్డ్‌పాటర్న్‌లో రెండు బీఏలు, న్యూపాటర్న్‌లో చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టంలో రెండు బీఏలు, మూడు ఎంఏలు పూర్తి చేశాడు. కంప్యూటర్ ట్రైనింగ్, కార్పెంటరీ ట్రైనింగ్ స్కిల్ సర్టిఫికెట్లు పొందాడు. ప్రస్తుతం పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ సబ్జెక్టులుగా బీఏ పూర్తి చేశాడు. ఇందులో 8.02 జీపీఏ సాధించి బంగారు పతకానికి ఎంపికయ్యాడు. మంగళవారం హైదరాబాదులో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ 26వ స్నాతకోత్సవంలో యుగంధర్‌కు డిగ్రీ పట్టాతో బంగారు పతకాన్ని అందించారు. కడప జైల్లో జీవితఖైదు అనుభవిస్తున్న యుగంధర్ ఓపెన్ డిగ్రీలో అత్యుత్తమ ప్రతిభ చూపించి బంగారు పతకం సాధించడం సంతోషంగా ఉందని జైలు పర్యవేక్షణాధికారి రాజేశ్వర్‌రావు, ఉప పర్యవేక్షణాధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు.



బంగారు పతకం అందుకుంటున్న యుగంధర్

## నేడు మహారథం



శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గరుడ వాహనసేవ తర్వాత అంతటి ప్రాముఖ్యత ఉన్నది మహారథోత్సవం (చెక్కతేరు). బుధవారం ఉదయం 7 గంటలకు మహారథం కదులుతుంది. 600 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన ఈమహారథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామిని వేంచేపు చేయనున్నారు. భారీ బరువు, ఎత్తుతో కలిగిన మహారథాన్ని మాడవీధుల్లో తిప్పడం కష్టమైన కార్యక్రమం. అందుకని మూడు నెలల ముందు నుంచే దీనికి కసరత్తు మొదలవుతుంది. ఇప్పటికే రథానికి బ్రేకులు, చక్రాలకు గ్రీసు వేశారు. మహారథంలోకి ఎక్కాల్సింది ఎవరు? చక్రాల కదలికల పరిశీలన.. చెక్కలను పెట్టడం.. చక్రాల సమీపానికి భక్తులు రాకుండా చూసే బాధ్యతలనూ కొందరికి అప్పగించారు. రథాన్ని లాగడంలో టీటీడీ సిబ్బందితో పాటు భక్తులను భాగస్వాములు చేయనున్నారు.

## బంగారు గొడుగు ఉత్సవం



మంగళవారం సాయంత్రం తిరుమలలో బంగారు గొడుగు ఉత్సవం నిర్వహించారు. పంతులుగారి రామనాథన్ ఆధ్వర్యంలో క్షురకులు, సిబ్బంది, సభ్యులు కల్యాణకట్టలో గొడుగుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు శాంతారామ్, రాష్ట్ర నాయి బ్రహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, కల్యాణకట్ట డిప్యూటీ ఈవో వెంకటయ్య, ఏఈవో అమర్నాథ్, సూపరింటెండెంట్లు రమాకాంత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహారథంపై దీనిని అలంకరించారు. తొలిరోజుల్లో కొయ్య గొడుగుతో ప్రారంభమై 1952 నుంచి రథానికి బంగారు గొడుగు సమర్పించడం జరుగుతోంది. పంతులుగారి ప్రస్తుత వంశీకుడైన రామనాథన్ సంప్రదాయంగా గొడుగును అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

# దూకేస్తున్నా...!

- విద్యుత్ టవరెక్కిన కర్ణాటక యువకుడు
- రక్షించేందుకు వలతో పోలీసుల విఫలయత్నం
- దూకే క్రమంలో కమ్మీలు తగిలి మృతి





విద్యుత్ టవర్ మీద వేలాడుతున్న శివ - తలకు బలమైన గాయమై అపస్మారకస్థితిలోనున్న యువకుడు

రేణిగుంట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దూకేస్తా.. ఆత్మహత్య చేసుకుంటా.. అంటూ విద్యుత్ టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన కర్ణాటక యువకుడి ఉదంతం విషాదంగా మారింది. రేణిగుంట మండలం గురవరాజపల్లిలో మంగళవారం ఈ ఘటన జరిగింది. కర్ణాటక రాష్ట్రం కడూరు ప్రాంతానికి చెందిన శివ(27) ఈనెల 27న శ్రీవారి దర్శనానికి బంధువులు, స్నేహితులతో కలిసి వచ్చారు. తిరుగు ప్రయాణంలో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకుంటానంటూ వచ్చేశారు. మంగళవారం ఉదయం గురవరాజపల్లిలోని 220 కేవీ విద్యుత్ టవరెక్కిన ఆయన ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ జయచంద్ర సిబ్బందితో అక్కడికి చేరుకుని విచారించారు. ఇంతలో అతడి సెల్‌ఫోను కింద పడింది. ఇందులోని నెంబర్ల ఆధారంగా కర్ణాటకకు చెందిన శివగా గుర్తించారు. అతడి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. ఒకవేళ శివ దూకితే రక్షించడానికి వలను సిద్ధం చేశారు. మరోవైపు పోలీసులు టవర్ ఎక్కేందుకు ప్రయత్నిస్తే వైరును పట్టుకుని వేలాడుతూ దూకేస్తాననేవాడు. చివరకు కిందకు దూకగా.. వలలో ఒడిసి పట్టుకునే సమయంలో టవర్ కమ్మీలు శివ తలకు తగలడంతో అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ మేరకు కేసు నమోదు చేశారు. ఇటీవల అల్లం పంటలో నష్టాలు రావడంతో అప్పులు పెరిగిపోయి మానసికంగా కుంగిపోయినట్లు శివ బావ గిరీష్ తెలిపారు. మద్యం తాగిన సమయంలో రెండుమూడు సార్లు ఆత్మహత్యకు యత్నించగా అడ్డుకోగా.. చివరకు తిరుపతిలో తమనుంచి తప్పించుకుని ఇక్కడ ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు.



దూకితే పట్టుకునేందుకు వలతో సిద్ధంగా ఉన్న పోలీసులు

# కళా నీరాజనం






## కథాకళి.. 'గోవింద'రాజు

కనులు, కనుబొమ్మలు తిప్పుతూ, గాల్లో ఎగురుతూ, చక్కటి హావ భావాలతో 'కథాకళి' ప్రదర్శన ఇచ్చిన ఇతడి పేరు గోవిందరాజు. కేరళ రాష్ట్రం. బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం. ఐపీఎస్ కావాలన్నది లక్ష్యం. దీనికోసం సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నారు. దీనికోసం చిన్నప్పటి నుంచి ఎంతో మక్కువతో నేర్చుకున్న నృత్యానికీ కొంత దూరమయ్యారు. కానీ, శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శనకు అవకాశం రాగానే, అన్నిటినీ పక్కన పెట్టి తిరుమలకు చేరుకున్నారు. మంగళవారం రాత్రి చంద్రప్రభ వాహనం ముందు 'కథాకళి' ప్రదర్శనతో భక్తుల మనసు దోచుకున్నారు.



- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమల గిరులు ఆటపాటలతో హోరెత్తిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం వాహనసేవల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళా బృందాల ప్రదర్శనలు భక్తులను తన్మయులను చేస్తున్నాయి. శాస్త్రీయ నృత్యాలు, జానపదాలు, పౌరాణిక వేషధారణలు.. ఎటు చూసినా అందమే! రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక, కేరళ, తమిళనాడు, మధ్యప్రదేశ్, జమ్మూకాశ్మీర్, గుజరాత్, మహారాష్ట్ర, ఒరిస్సా, ఛతీస్‌ఘడ్, పంజాబ్, మణిపూర్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ ఇలా మొత్తం 28 రాష్ట్రాల నుంచి 6,960 మంది కళాకారులుఆడిపాడి అలరించారు. మంగళవారం పగలు సూర్యప్రభ వాహనం ముందు, రాత్రి చంద్రప్రభ వాహన సేవలో తొమ్మిది రాష్ట్రాలకు సంబంధించిన 21 బృందాల్లోని 491 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తాదుల మనస్సును దోచుకున్నారు.టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, ఎస్వీ సంగీత నృత్య కళాశాల, దాససాహిత్య ప్రాజెక్ట్, అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

- తిరుమల(కల్చరల్), ఆంధ్రజ్యోతి


గూడూరు: దుర్గాదేవి అలంకారంలో విజయదుర్గాదేవి


చిల్లకూరు: దుర్గాదేవి అలంకారంలో ముత్యాలమ్మ




దుర్గాదేవి అలంకారంలో సూళ్లూరుపేట చెంగాళమ్మ - అమ్మవారికి సారెను తీసుకెళ్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులు


నాయుడుపేట: దుర్గాదేవి అలంకరణలో మూకాంబికాదేవి


పెళ్లకూరు: మహిషాసుర మర్దినిగా చండికాపరమేశ్వరి


వెంకటగిరి టౌన్: మహిషాసురమర్దిని అలంకారంలో కన్యకాపరమేశ్వరి


కోట: దుర్గాదేవి అలంకారంలో గ్రామదేవత కోటమ్మ


గూడూరు: ఆదిపరాశక్తి అలంకరణలో బజారుకలశం దుర్గాదేవి


కోట: దుర్గాదేవి అలంకారంలో వాసవీ కన్యకా పరమేశ్వరి

## దుర్గమ్మా.. కరుణించు తల్లీ...

సూళ్లూరుపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకం జరిపి పుష్పాలతో అలంకరించారు. అనంతరం చండీయాగం నిర్వహించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి, నెలవల సుబ్రహ్మణ్యం, అమృత దంపతులు, పరమేశ్వరి నగర్, ఇందిరా నగర్, ఝాన్సీనగర్ గ్రామస్తులు అమ్మవారికి సారె సమర్పించారు. అలంకారానికి నెల్లూరుకు చెందిన గంగిశెట్టి సాయికుమార్, చండీయాగానికి సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, హారిక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

**గూడూరు:** స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అలాగే బజారుకలశం వద్ద అమ్మవారిని ఆదిపరాశక్తిగా, రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని విజయదుర్గాదేవిగా, కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని పార్వతీదేవిగా, ధర్మరాజ స్వామి ఆలయంలో ద్రౌపదిదేవిని అన్నపూర్ణాదేవిగా, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

**చిల్లకూరు:** మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మను దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. అర్ధరథంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. అలాగే కలవకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిని రాజ్యలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

**వెంకటగిరి టౌన్:** పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరిదేవిని మహిషాసుర మర్ధినిగా, మూలవిరాట్‌కు చందనం అలంకారం, మదనాంచరేశ్వరిని కంచి కామాక్షిదేవిగా, కర్ణకమ్మ వీధిలోని కాత్యయనీ దేవిని విష్ణుదుర్గాదేవిగా, వెంకటేశ్వరస్వామికి నవనీత కృష్ణుడిగా అలంక రించి భక్తులకు దర్శనం కల్పించారు.

**కోట:** పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరిని దుర్గాదేవిగా, గూడలిలోని రామలింగ చాముండేశ్వరిని దుర్గాదేవిగా, కోట గ్రామ దేవత కోటమ్మను దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

**నాయుడుపేట టౌన్:** పట్టణంలోని మూకాంబికాదేవి, పోలేరమ్మ, మానసాదేవి, దుర్గమ్మ, కన్యకా పరమేశ్వరి, అంకమ్మ ఆలయాల్లో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా ఆలయాలలో అమ్మవార్లు వివిధ అలంకరణలో దర్శనమిచ్చారు. మూకాంబికాదేవిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

**పెళ్లకూరు:** మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెం గ్రామంలో ఉన్న చండికా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారిని మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలకరించి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

**డక్కిలి:** మండలంలోని దేవునివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి ఆలయంలో అమ్మవారు దర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.


గూడూరు: పార్వతిదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి


వెంకటగిరి టౌన్: విష్ణుదుర్గాదేవి అలంకారంలో కాత్యయనీ దేవి


వెంకటగిరి టౌన్: కంచికామాక్షీదేవి అలంకారంలో మందనాంచరేశ్వరి


డక్కిలి: దుర్గాదేవి అలంకరణలో పార్వతీదేవి

## టీడీపీ నేతలకు ఎమ్మెల్యే విజయశ్రీ పరామర్శ

పెళ్లకూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పేరం రమేష్ నాయుడిని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు మంగళవారం పరామర్శించారు. ఇటీవల రమేష్ నాయుడు అనారోగ్యానికి గురై తిరుపతిలో చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. మ్మెల్యే విజయశ్రీ దంపతులు, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్యతో కలసి రమేష్ నాయుడు నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వీరి వెంట టీడీపీ నేలవల్లి సిద్దులయ్య నాయుడు ఉన్నారు.

**నాయుడుపేట:** టీడీపీ నాయకురాలు, మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గరైన ప్రభావతమ్మ ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నాయుడుపేట పట్టణంలోని ప్రభావతమ్మ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు రవీ, భీమవరం సర్పంచ్ అమృత సరళ, మాజీ జడ్పీటీసీ శ్రీరాం ప్రసాద్, అవధానం సుధీర్, హైమావతి, సరళ, లక్ష్మి, గిరి, నెలవల ప్రసాద్, తదితరులు ఉన్నారు.

## మూడు లారీల ఢీ: డ్రైవర్‌కు గాయాలు

తడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హఠాత్తుగా బ్రేక్ వేసిన లారీని మరో రెండు లారీలు వెనుక నుంచి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయలయ్యాయి. నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీకి బోడిలింగాలపాడు మలుపు వద్ద అకస్మాత్తుగా బైక్ అడ్డు రావడంతో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వస్తున్న మరో లారీ, దాని వెన కొస్తున్న మరో లారీ వరుసగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మూడు లారీలు కొంతమేర దెబ్బతిన్నాయి. ఓ లారీ క్లీనర్ సిద్ధిరాజు క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడగా, డ్రైవర్ కృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వైసీపీ కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

పెళ్లకూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు డిజిటల్ బుక్ యాప్‌ను తీసుకొచ్చినట్లు ఎస్సీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం చిల్లకూ రులో డిజిటల్ బుక్ యాప్ పోస్టర్ ఆవిష్కరించారు.

## చిట్టమూరమ్మ ఆలయంలో పూజలు

చిట్టమూరు, సెప్టెంబర్ 30(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత చిట్టమూరమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్టమూరు మాజీ సర్పంచ్ అశోక్ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణ

బాలాయపల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది. సర్వే నంబరు 70లో ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నా రెవెన్యూ అదికారులు చూసి చూడనట్లు వ్యహహరిస్తున్నారు. అదే వ్యక్తి మరో రెండెకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించి మంగళవారం ఎక్స్‌వేటర్‌తో మొక్కలు తొలగిస్తుండగా గ్రామస్తులు రెవెన్యూ అదికారులకు సమాచారం ఇచ్చారు. వీఆర్వో మోహన్ వెళ్లి ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకుని ఎక్స్‌కవేటర్‌ను పంపించేశారు. ఇదే పంచాయతీలోని పాపిరెడ్డిపల్లి వడ్డిపాళెం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని వెంకటగిరి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి ప్లాట్లు వేసి లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను రక్షించాలని కోరుతున్నారు.

## తోపుడుబండి అందజేత

చిల్లకూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం చేడిమాల గ్రామంలోని రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు నాయుడు గూడూరుకు చెందిన జ్యోతి అనే మహిళకు తోపుడు బండి అందజేశారు. ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



పోలేరమ్మకు పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన ప్రత్యేక పూజల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ముందుగా ఆలయ చైర్మన్ నానాబాల సుబ్బారావు, ఈవో రవికృష్ణ ఎమ్మెల్యేకు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, అమృత సరళ దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రత్యేక పూజల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, టీడీపీ నాయకులు సంచి కృష్ణయ్య, గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, పసల గంగాప్రసాద్, నిత్యకృష్ణారెడ్డి, నారాయణ, రవి, కుబేరు మణి, గంగాప్రసాద్, పొట్లపూడి రాజేష్, చిగురువాడ అశోక్, చెంగయ్య పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కోట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీవో మునికుమారి తెలిపారు. కోట మండలంలోని విద్యానగర్(ఓసీ), మద్దాలికండ్రిగ(బీసీ-డీ), పలగాటి నరసింహారెడ్డి కాలనీ (జనరల్), వాకాడు మండలంలోని పంబలి(బీసీ-ఏ), చిట్టమూరు మండలంలోని కమ్మరిపాళెం(బీసీ-డీ), బయ్యవారిపాళెం(బీసీ-బీ), ముక్కిడిపాళెం (జనరల్), వాకాడు దళితవాడ(ఎస్సీ), కోట దళితవాడ(ఎస్సీ) హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై, 1-7-2025 నాటికి 21-35 సంవత్సరాలలోపు వయసు కలిగిన స్థానిక వివాహిత మహిళలు అర్హులని సీడీపీవో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈనెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## పురుగుల మందు తాగిన యువకుడి మృతి



సునీల్(ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబడిపాలెం గ్రామానికి చెందిన సూళ్లూరు సునీల్(29) ఇటీవల కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మృతుడికి భార్య సంధ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారువీధిలో ఉన్న ఓ వస్త్ర దుకాణంలో స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం దుకాణంలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

## మోటారు సైకిల్‌ను ఢీకొన్న ఆటో

### ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడిన సురేష్

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మూరు సమీపంలో మోటారు సైకిల్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం గ్రామానికి చెందిన సురేష్ మోటారు సైకిల్‌పై మంగళవారం రాత్రి స్వగ్రామానికి వెళ్తుండగా తుమ్మూరు సమీపంలో ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.